

ESTD : 1999

# విజన్ ఆంధ్ర

తెలుగు దినపత్రిక

VISION ANDHRA TELUGU DAILY

స్టేట్ విజన్

STATE VISION

మంగళవారం 13-10-2026 పేజీలు : 16


## రిమ్స్ ఆసుపత్రి అభివృద్ధికి

# ప్రత్యేక చర్యలు

## -ఎమ్మెల్యే పాయల్ శంకర్



ఆదిలాబాద్ అర్బన్, అక్టోబర్ 12 (విజన్ ఆంధ్ర): ఆదిలాబాద్‌లోని రిమ్స్ ఆసుపత్రిలో రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు మౌలిక సదుపాయాల అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఎమ్మెల్యే పాయల్ శంకర్ అధికారులను ఆదేశించారు. రిమ్స్ ఆసుపత్రిని సందర్శించిన ఆయన, వివిధ అభివృద్ధి పనుల పురోగతిపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. హైదరాబాద్‌లోని గాంధీ, ఉస్మానియా ఆసుపత్రుల తర్వాత పెద్ద సంఖ్యలో గిరిజన, ఇతర ప్రాంతాల రోగులు రిమ్స్‌కు వస్తున్నారని తెలిపారు. పెరుగుతున్న రోగుల సంఖ్యకు అనుగుణంగా రూ.50 కోట్లతో ఎంసీహెచ్ భవనం, రూ.11.10 కోట్లతో మరుగుదొడ్లు, అంతర్గత సీసీ రోడ్లు, ప్లంబింగ్ పనులకు అనుమతులు లభించాయన్నారు. ఈ పనులను వివిధ శాఖల ఇంజినీరింగ్ అధికారులు సమన్వయంతో నిర్ణీత సమయంలో పూర్తి చేయాలని సూచించారు. వైద్యులు, సిబ్బంది మానవతా దృక్పథంతో, అంకితభావంతో రోగులకు సేవలు అందించాలని కోరారు. వైద్యుల కొరత సమస్యను పరిష్కరించేందుకు మారుమూల ప్రాంతాల్లో పనిచేసేలా ప్రోత్సాహకాలు కల్పించే అంశాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తున్నట్లు తెలిపారు. అలాగే రిమ్స్‌లో మరిన్ని అభివృద్ధి పనుల కోసం సుమారు రూ.98 కోట్లతో రూపొందించిన ప్రతిపాదనలను ప్రభుత్వానికి పంపామని, సీఎం రేవంత్ రెడ్డి స్పందించి ఈ నిధులు మంజూరు చేయాలని ఎమ్మెల్యే పాయల్ శంకర్ విజ్ఞప్తి చేశారు.

# భర్తను చంపిన భార్య

## కూతురిని లైంగికంగా వేధించడముతో ఓపిక నశించి

## భర్తను కళ్ళలో కారం చల్లి చెట్టుకు కట్టేసి చంపిన భార్య

**- కేసు నమోదు చేసి వివరాలు వెల్లడించిన హుస్నాబాద్ ఏసీపీ సదానందం**



హుస్నాబాద్ విజన్ ఆంధ్ర అక్టోబర్ 12 : కూతురుని తండ్రి లైంగికంగా వేధించడంతో ఓపిక నశించి భర్తని కళ్ళలో కారం చల్లి చెట్టుకు కట్టేసి చంపేసిన సంఘటన సిద్దిపేట జిల్లా అక్కన్నపేట మండలం సేవాలాల్ మహరాజ్ తాండలో ఆదివారం రోజున జరిగింది. జరిగిన హత్యకు సంబంధించిన వివరాలు సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ ఏసిపి సదానందం సోమవారం సాయంత్రం విలేకరుల సమావేశంలో వెల్లడించారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ మాలోతు రాజేశ్వరి వయస్సు35 గతంలోనే వివాహం జరిగిందని,ఒక అమ్మాయి పుట్టిన తర్వాత తన భర్త డెంగ్యూ వ్యాధితో మృతి చెందాడాని,మొదటి భర్త చనిపోవడంతా మళ్ళీ పదిహేను సంవత్సరాల క్రితం మల్కాపూర్ తండా నర్మెట మండలానికి చెందిన భానోతు భగవాన్ తొ రెండో వివాహం జరిగింది. వీరికి ముగ్గురు పిల్లలు కూడా వున్నారు. తరుచు తాగి వచ్చి మొదటి భర్త కూతురుతో లైంగిక చర్యలకు పాల్పడడానికి తరచూ ప్రయత్నం చేస్తుండడంతో కూతురుపై అలా చేయకూడదని చాలాసార్లు నచ్చచెప్పే ప్రయత్నం కూడా చేసిందని దీంతో భార్యాభర్తల మధ్య రెండు సంవత్సరాల నుంచి తీవ్ర ఘర్షణలు

5 పేజీలో...

# ప్రభుత్వ భూమి వివాదం..

# నిర్మాణ అనుమతులపై విచారణకు ఆదేశాలు!

- ప్రజావాణిలో ఫిర్యాదుపై స్పందించిన జోనల్ కమిషనర్
- టౌన్ ప్లానింగ్ ఏసీపీ సుమిత్రాకు మౌఖిక సూచనలు
- సర్వే వివరాలు, అనుమతుల రికార్డుల పరిశీలనకు ఆదేశం
- తదుపరి చర్యలపై స్థానికంగా ఉత్కంఠ

11 పేజీలో...

# కెనాల్ నీటితో కళ్లెం గ్రామ చెరువులు మత్తడి..

## ఎమ్మెల్యే కడియం శ్రీహరి చొరవతో జలకళ

**- సర్పంచ్ బండ శోభ చంద్రమౌళి ఆధ్వర్యంలో మత్తడి వద్ద ప్రత్యేక పూజలు**



లింగాల గణపురం అక్టోబర్ 12 (విజన్ ఆంధ్ర) జనగామ జిల్లా లింగాల గణపురం మండలం లోని కళ్లెం గ్రామంలో స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గ ఎమ్మెల్యే కడియం శ్రీహరి చొరవతో కెనాల్ ద్వారా వచ్చిన నీటితో జనగామ జిల్లా లింగాలఘణపురం మండలం కళ్లెం గ్రామంలోని చెరువులు నిండుకుండలా మారాయి. గ్రామంలోని చెరువులు మత్తడి పోస్తుండటంతో గ్రామంలో జలకళ సంతరించుకుంది. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ బండ శోభ చంద్రమౌళి ఆధ్వర్యంలో చెరువుల మత్తడి వద్ద ప్రత్యేక పూజా కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ ఆరే సంపత్, పీఏసీఎస్ చైర్మన్ బుషిగంపల ఉపేందర్, ఇరిగేషన్ ఏఈ, ఏఎంసీ మాజీ డైరెక్టర్ బుషిగంపల ఆంజనేయులు, జీడికల్ దేవస్థాన చైర్మన్ మూర్తి, దేవస్థాన పునర్నిర్మాణ కమిటీ చైర్మన్ జిల్లాల వెంకటరెడ్డి పాల్గొన్నారు. అలాగే వార్డు సభ్యులు మబ్బు సమ్మక్క, రమేష్, మహమ్మద్ యాకూబ్ పాషా, కానుగంటి కవిత, యాకూబ్, తాటిపాముల భాగ్యలక్ష్మి, రాంబాబు, నకిర్త కర్ణాకర్, మబ్బు క్రాంతికుమార్, మబ్బు కలమ్మ, సత్తయ్య, కొత్తపేట బాలమణి, భాస్కర్, గ్రామ శాఖ అధ్యక్షులు మబ్బు కన్నయ్య, లింగాల సంపత్, ఇందిరమ్మ కమిటీ సభ్యులు, గ్రామ పుర ప్రముఖులు, గ్రామ ప్రజలు, గ్రామ పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

చెరువులు నిండటంతో గ్రామంలో వ్యవసాయానికి, పశువులకు నీటి లభ్యత మెరుగుపడటంతో పాటు గ్రామ ప్రజల్లో ఆనందం వ్యక్తమవుతోంది. కెనాల్ నీటితో చెరువులు నిండటానికి చొరవ చూపిన ఎమ్మెల్యే కడియం శ్రీహరికి గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.

## ప్రజావాణి ఫిర్యాదులను సత్వరం పరిష్కరించాలి

**-జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా.**

**ప్రజావాణికి 101 పిర్యాదుల స్వీకరణ.**



మహబూబ్ నగర్ : ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదులను సత్వరం పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా అధికారులకు ఆదేశించారు.
సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా, రెవెన్యూ అదనపు కలెక్టర్ జె.ఎల్.బి హరిప్రియ తో కలిసి అర్జిదారుల నుండి దరఖాస్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా అర్జిదారుల సమస్యలను కలెక్టర్ సావధానంగా విన్నారు. ప్రతి సమస్యను జాగ్రత్తగా పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ వారికి భరోసా ఇచ్చారు.
అధికారులు ప్రజావాణి దరఖాస్తులను క్షుణ్ణంగా చదివి అర్థంచేసుకుని క్షేత్ర స్థాయిలో పరిశీలించి సత్వరం పరిష్కరించాలని అన్నారు.
ప్రజావాణిలో పంచాయతీరాజ్, మున్సిపల్, నీటిపారుదల, జిల్లా సంక్షేమం, వ్యవసాయం, పౌరసరఫరాల శాఖ, భూ సర్వే రికార్డులు, గృహ నిర్మాణం, రోడ్డు రవాణా, పోలీస్, గిరిజన అభివృద్ధి శాఖ, విద్యుత్ శాఖ, విద్య, వైద్య ఆరోగ్యం , మైనింగ్, అటవీ, గ్రామీణ అభివృద్ధి, తదితర శాఖలకు సంబంధించిన మొత్తం 101 వినతులను అధికారులు స్వీకరించారు.
ఈ కార్యక్రమంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ జె.ఎల్.బి హరిప్రియ డి.ఆర్.ఓ ఎ. నిర్మల, భూసేకరణ ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్ రామ్ రెడ్డి, జెడ్. పి. సి. ఈ.ఓ, ఇంచార్జి డి. పి. ఓ వెంకట రెడ్డి, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఆంజనేయ స్వామి ఆలయ ప్రహరీ నిర్మాణానికి భూమి పూజ



కాటారం డివిజన్ ప్రతినిధి, అక్టోబర్ 12 (విజన్ ఆంధ్ర): జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాటారం మండల కేంద్రంలోని కాటారం శ్రీ భక్తాంజనేయ స్వామి ఆలయం ప్రహరీ నిర్మాణానికి సోమవారం భూమి పూజ నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్ బొమ్మన మల్లారెడ్డి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో సర్పంచ్ పంతకాని సడవలి , మాజీ ఎంపీపీ పంతకాని సమ్మయ్య, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొని వేద మంత్రోచ్ఛరణాల మధ్య భూమి పూజ నిర్వహించారు. ఆలయ పునర్నిర్మాణంలో భాగంగా చేపట్టిన కార్యక్రమాలు సజావుగా కొనసాగించాలని కోరారు. నిర్మాణంలో చేపట్టబోయే కార్యక్రమాలకు భక్తులు, పుర ప్రముఖులు, ప్రజలు ఇతోధికంగా విరాళాలు అందజేయాలని కోరారు. దసరా ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు ప్రణాళికాబద్ధంగా కార్యాచరణ చేపట్టారు. ఈ కార్యక్రమంలో భక్తాంజనేయ ఆలయ కమిటీ సభ్యులు తోటపల్లి వీరారెడ్డి, బీరెల్లి అంజయ్య, మద్ది లక్ష్మీ నరసింహమూర్తి, పులి అశోక్, కొడపర్తి రవి, పెండ్యాల శ్రీరాములు, గౌని సుధాకర్, గడ్డం చంద్రయ్య, ఓలపు రాజబాబు, గడ్డం పర్వతాలు, జీయర్ మల్లేష్, జల్లారపు మల్లయ్య, , గౌని జగదీశ్వర్,

# సేవా మూర్తి జన్మదిన వేడుక..

**- పర్యావరణ పరిరక్షణకు జమ్మి మొక్క నాటిన లయన్ కోటి రెడ్డి!**

**- లయన్ పి.సి. ఓబుల్ రెడ్డి 82 ఏళ్ల జీవితంలో 48 ఏళ్లపాటు లయన్స్ క్లబ్‌కు సేవలు**

**- మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడాలని పిలుపు**



కుత్బుల్లాపూర్, అక్టోబర్ 12 (విజన్ ఆంధ్ర): సేవా కార్యక్రమాలతో ఎంతోమంది నిరుపేదలకు అండగా నిలిచి, లయన్స్ క్లబ్‌లో సుదీర్ఘకాలంగా సేవలందిస్తున్న పాస్ట్ డిస్ట్రిక్ట్ గవర్నర్ లయన్ పి.సి. ఓబుల్ రెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకుని అవంతి నగర్ ఈస్ట్ కాలనీలో జమ్మి మొక్కను నాటారు. లయన్స్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ 320-ఐ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన ఈ కార్యక్రమంలో డిస్ట్రిక్ట్ పర్యావరణ పరిరక్షణ చైర్‌పర్సన్ లయన్ అన్నెం కోటి రెడ్డి తెలంగాణ రాష్ట్ర అధికారిక వృక్షంగా పేర్కొన్న జమ్మి చెట్టును నాటారు. ఈ సందర్భంగా అన్నెం కోటి రెడ్డి మాట్లాడుతూ.. లయన్ పి.సి. ఓబుల్ రెడ్డి 82 ఏళ్ల సుదీర్ఘ జీవితంలో 48 ఏళ్లపాటు లయన్స్ క్లబ్‌కు అంకితభావంతో సేవలందించారని తెలిపారు. ఎన్నో సేవా కార్యక్రమాలు చేపట్టి, నిరుపేదలకు అండగా నిలిచి సమాజంలో మంచి గుర్తింపు సంపాదించుకున్నారని కొనియాడారు. అటువంటి సేవామూర్తి జన్మదినాన్ని పురస్కరించుకుని జమ్మి మొక్కను నాటడం సంతోషంగా ఉందన్నారు.

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి

పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని, భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన వాతావరణాన్ని అందించేందుకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని కోటి రెడ్డి పిలుపునిచ్చారు. తన జన్మదినాన్ని పురస్కరించుకుని జమ్మి మొక్క నాటిన అన్నెం కోటి రెడ్డిని లయన్ పి.సి. ఓబుల్ రెడ్డి హృదయపూర్వకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో లయన్ రంగారెడ్డి, లయన్ ఏలందర్ రెడ్డి, లయన్ ప్రభాకర్ రెడ్డితో పాటు అవంతి నగర్ ఈస్ట్ కాలనీ వాసులు పాల్గొన్నారు.

## ఏడుపాయల్లో గాయత్రీ దేవి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చిన వనదుర్గామాత



పాపన్నపేట,అక్టోబర్ 12 విజన్ ఆంధ్ర: తెలంగాణలో ప్రసిద్దిగాంచిన శ్రీ ఏడుపాయల వనదుర్గామాత సన్నిధిలో నవరాత్రి ఉత్సవాలలో రెండవ రోజైన సోమవారం రోజు దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. అమ్మవారిని నవరాత్రుల ప్రత్యేక పూజారులు గాయత్రీదేవి అవతారంలో గులాబీ వర్ణం రంగులో అత్యంత సుందరంగా ముస్తాబు చేసి అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించారు. నవరాత్రుల సందర్భంగా కర్ణాటక,మహారాష్ట్ర, హైద్రాబాద్ తదితర ప్రాంతాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చి ప్రత్యేక మంటపంలో ఏర్పాటు చేసిన అమ్మవారినీ దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ప్రత్యేక పూజారులు పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈకార్యక్రమంలో ఆలయ సిబ్బంది సూర్య శ్రీనివాస్, మధుసూదన్ రెడ్డి,ప్రతాప్ రెడ్డి,సాయిబాబా,నరేష్, మహేష్,యాదగిరి,దీపక్ రెడ్డి,బలరాం తదితరులు పాల్గొన్నారు.నవరాత్రుల సందర్భంగా ఏడుపాయ ల్లో భక్తులకు అన్న ప్రసాదం కల్పించారు. ఏడుపాయల్లో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పాపన్నపేట ఎస్ఐ సారా శ్రీనివాస్ గౌడ్ ఆధ్వర్యంలో పోలీసులు గట్టి బందోబస్తు నిర్వహించారు.

# ఎట్టకేలకు రోడ్డు పనులు వేగవంతం!

**నార్సింగి--శంకరంపేట రహదారితో ప్రజలకు ఊరట**

**డిసెంబర్‌లోగా పూర్తి కానున్నాయన్న సమాచారంతో ప్రయాణికుల్లో ఆశలు**





పాపన్నపేట అక్టోబర్ 12, విజన్ ఆంధ్ర: ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న నార్సింగి--శంకరంపేట రహదారి పనులు వేగవంతం కావడంతో ప్రజలు, ప్రయాణికుల్లో ఆశలు చిగురిస్తున్నాయి. ఎన్నాళ్లుగానో మెరుగైన రహదారి సౌకర్యం కోసం ఎదురుచూస్తున్న ప్రజలకు ఈ పనులు పూర్తయితే ఎంతో ఊరట లభించనుంది. రహదారి పనులను డిసెంబర్‌లోగా పూర్తి చేయనున్నట్లు సమాచారం అందుతుండటంతో ఈ మార్గంలో రాకపోకలు సాగించే వారిలో సంతోషం వ్యక్తమవుతోంది.

ప్రయాణ కష్టాలకు త్వరలో చెక్!

నార్సింగి నుంచి శంకరంపేట వరకు ప్రయాణించే ప్రజలు రహదారి సౌకర్యాల మెరుగుదల కోసం చాలాకాలంగా ఎదురుచూస్తున్నారు. రోడ్డు అభివృద్ధి పనులు పూర్తయితే ప్రయాణం సులభతరం కావడంతో పాటు సమయం ఆదా కానుంది. రైతులు, వ్యాపారులు, ఉద్యోగులు, విద్యార్థులకు ఈ రహదారి ఎంతో ఉపయోగకరంగా మారనుంది.

త్వరగా పూర్తిచేయాలని ప్రజల ఆకాంక్ష

రహదారి పనులు వేగంగా కొనసాగి నిర్ణీత గడువులోగా పూర్తయితే నిత్యం ఈ మార్గంలో ప్రయాణించే వారికి పెద్ద ఊరట లభించనుంది. పనుల్లో జాప్యం లేకుండా, నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ వీలైనంత త్వరగా రహదారిని అందుబాటులోకి తీసుకురావాలని ప్రజలు ఆకాంక్షిస్తున్నారు. ఎన్నాళ్లుగానో ఎదురుచూస్తున్న రహదారి సౌకర్యం అందుబాటులోకి వస్తే ఈ ప్రాంత అభివృద్ధికి మరింత ఊతం లభించనుంది.

# కాంగ్రెస్‌వి గాలి ఆరోపణలు.

## ఓట్ల తొలగింపుపై ఆధారాలు చూపాలి

-బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి కప్పర ప్రసాదరావు



గజ్వేల్, 12 అక్టోబర్ 2026 (విజన్ ఆంధ్ర) : ఓటు చోరీ జరిగిందంటూ కాంగ్రెస్ పార్టీ చేస్తున్న ఆరోపణలను బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి కప్పర ప్రసాదరావు తీవ్రంగా ఖండించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేవలం రాజకీయ లబ్ధి కోసమే ఆధారాలు లేని ఆరోపణలు చేయడం సరికాదని మండిపడ్డారు. ఓట్ల తొలగింపునకు సంబంధించి కాంగ్రెస్ నేతల వద్ద ఉన్న ఆధారాలను తక్షణమే ప్రజల ముందుంచాలని డిమాండ్ చేశారు. ఇటీవల గజ్వేల్‌లో ఓటర్ల జాబితాపై బీజేపీ నిజనిర్ధారణ చేపట్టిందని పేర్కొంటూ, ఏ పోలింగ్ బూత్‌లో ఎంతమంది, ఏ విభాగానికి చెందిన ఓటర్ల పేర్లు తీసివేశారో స్పష్టమైన వివరాలు బయటపెట్టాలని ప్రశ్నించారు. హుస్నాబాద్ నియోజకవర్గంలో అర్హులైన ఓటర్ల ఓట్లు తొలగించారనే అంశంపై రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ బహిరంగ చర్చకు సిద్ధమా? అని సవాల్ విసిరారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రరావుకు సమయం, తేదీ కేటాయించాలని కాంగ్రెస్ నేతలు కోరే ముందు, హుస్నాబాద్‌లో తొలగించినట్లు చెబుతున్న ఓట్లపై స్పష్టత ఇవ్వాలన్నారు. ప్రజాస్వామ్యంలో అర్హులైన ప్రతి పౌరుడికీ ఓటు హక్కు దక్కాలని, ఆధారాలు లేని రాజకీయ విమర్శలు మాని నిజాలను ప్రజలకు తెలియజేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ మాజీ మున్సిపల్ చైర్మన్ గాడిపల్లి భాస్కర్, గజ్వేల్ పట్టణ బీజేపీ అధ్యక్షుడు మనోహర్ యాదవ్, ములుగు మండల అధ్యక్షుడు లక్ష్మణ్ గౌడ్, జిల్లా కౌన్సిల్ మెంబర్ వెంకట్ రెడ్డి, గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ యువ మోర్చా అధ్యక్షుడు రాజేశ్వర్ చారి పాల్గొన్నారు.

# మల్లన్న సాగర్ భూనిర్వాసితులకు వెంటనే న్యాయం చేయాలి

- సాగునీటి ప్రాజెక్టు కోసం ఊళ్లను, భూములను త్యాగం చేసినా దక్కని ప్యాకేజీలు
- గ్రామాల పేర్లను రికార్డుల నుంచి తొలగించే ప్రయత్నాలను ఉపసంహరించుకోవాలి
- సమస్యలు పరిష్కరించకపోతే ఉద్యమం ఉధృతం చేస్తాం
- సీపీఐ గజ్వేల్ నియోజకవర్గ కార్యదర్శి శివలింగ కృష్ణ హెచ్చరిక



గజ్వేల్, 12 అక్టోబర్ 2026 (విజన్ ఆంధ్ర) : మల్లన్న సాగర్ రిజర్వాయర్ నిర్మాణం కారణంగా తమ సొంత ఇళ్లను, సాగుభూములను, పుట్టిన ఊరిని వదులుకొని సర్వస్వం త్యాగం చేసిన భూనిర్వాసితులకు ప్రభుత్వం వెంటనే న్యాయం చేయాలని సీపీఐ గజ్వేల్ నియోజకవర్గ కార్యదర్శి శివలింగ కృష్ణ డిమాండ్ చేశారు. సోమవారం రోజు గజ్వేల్ అంబేద్కర్ చౌరస్తా వద్ద భూనిర్వాసితులతో కలిసి రాస్తారోకో నిర్వహించారు. అనంతరం ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా ఆర్డీవో కి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా శివలింగ కృష్ణ మాట్లాడుతూ మల్లన్న సాగర్ ప్రాజెక్టు కోసం పల్లెపహాడ్, వేములఘాట్, ఎర్రవల్లి, సింగారం, కిష్టాపూర్, లక్ష్మాపూర్, బంజారపల్లి గ్రామాలు సంపూర్ణంగా ముంపునకు గురయ్యాయి. ప్రజలు సాగునీటి ప్రాజెక్టు కోసం ఎంతో త్యాగం చేశారన్నారు. ప్రాజెక్టు పూర్తయి చాలాకాలం గడుస్తున్నప్పటికీ, నిర్వాసితులకు ప్రభుత్వం నుండి అందవలసిన పలు కీలకమైన ప్యాకేజీలు, ఒంటరి మహిళలకు ఇళ్ల కేటాయింపు, రిజిస్ట్రేషన్ ప్లాట్లు, ఇండ్లు మరియు వ్యవసాయ భూములకు సంబంధించిన భూసేకరణ పరిహారం, అసైన్డ్ భూముల డబ్బులు నేటికీ పెండింగ్‌లోనే ఉన్నాయన్నారు. తాతల ముత్తాతల కాలం నుండి వస్తున్న ముంపు గ్రామాల పేర్లను, గుర్తింపును ప్రభుత్వ రికార్డుల నుండి తొలగించేందుకు ప్రయత్నించడం దారుణమని మండిపడ్డారు. రాష్ట్ర ప్రభుత్వం మరియు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తక్షణమే స్పందించి, మల్లన్న సాగర్ భూనిర్వాసితుల సమస్యలను పరిష్కరించాలని కోరారు. నిర్వాసితుల సమస్యలను పరిష్కరించకపోతే, భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) ఆధ్వర్యంలో నిర్వాసితులందరినీ ఏకం చేసి ఉద్యమాలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో భూనిర్వాసితులు, సీపీఐ పార్టీ నాయకులు, సిపిఐ పార్టీ నాయకులు వెంకట చారి, వెంకటేశం పాల్గొన్నారు.

## జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు కేటాయించాలని ప్రజా వాణి లో వినతి పత్రం.

గండీడ్ మండలం అక్టోబర్ 12 (మహబూబ్ నగర్ జిల్లా, విజన్ ఆంధ్ర ) : గండీడ్ మండల పరిధిలోని జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు కేటాయించాలని ప్రజావాణిలో వినతిపత్రం ౹ఖఔజీ143 మండల్ ఆధ్వర్యంలో మండల అధ్యక్షుడు గోపాల్ ఆధ్వర్యంలో అందజేయడం జరిగింది. దశాబ్దాల కాలం నుంచి ఇళ్ల స్థలాలు కేటాయించలేరని ఎన్నిసార్లు విన్నవించిన నిర్లక్ష్యం వహిస్తూ ఇళ్ల స్థలాలు కేటాయించలేదు. సాధ్యమైనంత త్వరలో విలేకరులకు ఇళ్ల స్థలాలు కేటాయించాలని కోరుతున్నారు. ఈ కార్యక్రమంలో మండల విలేకరులందరూ పాల్గొనడం జరిగింది.



# బాల్కొండ నియోజక వర్గంలో బతుకమ్మ సంబరాలు

బాల్కొండ విజన్ ఆంధ్ర నిజామాబాదు అక్టోబర్ 12:- నిజామాబాదు జిల్లా బాల్కొండ నియోజక వర్గంలోని అనేక గ్రామాల్లో అంబరాన్నంటిన బతుకమ్మ సంబరాలు అత్యంత వైభవంగా, ఉత్సాహ భరిత వాతావరణం లో నిర్వ హిస్తున్నారు.బాల్కొండ లోని నవీన్ పాఠశాల్లోని విద్యార్థిని విద్యార్థులతో బతుకమ్మ ఆడుతూ పూర వీధుల్లో ఊరేగించారు.తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగ వేడుకల్లో విద్యార్థినీ, విద్యార్థులు,ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు, ఉత్సా హంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రకృతిలో సహజంగా లభించే గునుగు, తంగేడు, బంతి, చామంతి తదితర రంగు రంగుల పూలను సేకరించి, అందమైన బతుకమ్మలను రూపొందించారు.సంప్రదాయ దుస్తుల్లో ముస్తాబైన విద్యార్థినులు బతుకమ్మల చుట్టూ తిరుగుతూ జానపద గీతాలు ఆలపిస్తూ, చప్పట్లతో ఆడిన ఆటపాటలు అందరినీ విశేషంగా ఆకట్టుకున్నాయి.ఈ సందర్భంగా పాఠశాల కరెస్పాండెంట్ ఆకుల నరేందర్ , మాట్లాడుతూ, బతుకమ్మ పండుగ తెలంగాణ మహిళల ఆత్మగౌరవానికి, ప్రకృతి ఆరాధనకు, సాంస్కృతిక వైభవానికి ప్రతీక అని పేర్కొన్నారు. ఇటువంటి పండుగల నిర్వహణ ద్వారా విద్యార్థుల్లో మన సంస్కృతి, సంప్రదాయాల పట్ల గౌరవం పెంపొందించడంతో పాటు ప్రకృతి పరిరక్షణ, పర్యావరణ స్పృహ, సామాజిక ఐక్యత వంటి విలువలు అలవడ తాయని తెలిపారు.పూలతో ప్రకృతిని పూజించే బతుకమ్మ పండుగ విశిష్టతను విద్యార్థుల కు వివరించి, మన తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని తెలియజేశారు.ఈ



కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు మరియు ఉపాధ్యాయినీ, ఉపాధ్యా యులు, విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొని బతుకమ్మ సంబరాల్లో భాగంగా జానపద గీతాలు, విద్యార్థుల ఆనందోత్సాహాలతో పండుగ శోభను సంతరించుకుంది.

# రాబోయే పంటల సాగుపై రైతులకు అవగాహన



ముధోల్ : అక్టోబర్ 12 : విజన్ ఆంధ్ర. ముధోల్ మండల కేంద్రంలోని రైతు వేదికలో సోమవారం రైతు నేస్తం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాబోయే పంటల సాగుపై ఎల్‌నినో ప్రభావం, వాతావరణ మార్పులు, విద్యుత్ సమస్యలు తలెత్తే అవకాశాల గురించి సంబంధిత శాఖ మంత్రి, వ్యవసాయ శాస్త్రవేత్తలు రైతులకు వివరించారు. రాబోయే రోజుల్లో పంటల సాగులో తీసుకోవాల్సినజాగ్రత్తలు,వ్యవసాయంలో ఎదురయ్యే సమస్యలను అధిగమించే మార్గాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ అధికారి రచన, ఐకేపీ ఏపీఎం గురుచరణ్, నిర్మల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యవర్గ సభ్యుడు పతంగి కిషన్, ముధోల్ మాజీ ఎంపీటీసీ, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు రావుల గంగారెడ్డి, మండల వ్యవసాయ విస్తరణ అధికారులు, రైతులు పాల్గొన్నారు.

# ప్రజావాణి ఫిర్యాదులపై తక్షణమే స్పందించాలి

## బాధితులకు సకాలంలో న్యాయం అందించాలి: జిల్లా ఎస్పీ జి. జానకి షర్మిల



నిర్మల్, అక్టోబర్ 12: విజన్ ఆంధ్ర. నిర్మల్ జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా ఎస్పీ డా. జి. జానకి షర్మిల ప్రజల నుంచి ఫిర్యాదులు, వినతులను స్వీకరించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఫిర్యాదుదారులతో మాట్లాడి వారి సమస్యలను స్వయంగా అడిగి తెలుసుకున్నారు.ప్రజావాణిలో అందిన ప్రతి ఫిర్యాదుపై సంబంధిత పోలీసు అధికారులు తక్షణమే స్పందించాలని ఎస్పీ ఆదేశించారు. ఫిర్యాదులను చట్టపరంగా పరిశీలించి, బాధితులకు సకాలంలో న్యాయం అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. సమస్యల పరిష్కారంలో అనవసర జాప్యం చేయకుండా, ఫిర్యాదుదారులతో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని స్పష్టం చేశారు.ప్రజావాణి ద్వారా అందిన ఫిర్యాదుల పరిష్కారానికి తీసుకుంటున్న చర్యలను ఎప్పటికప్పుడు సమీక్షించాలని అధికారులకు సూచించారు. ప్రజలకు పోలీసు సేవలను మరింత చేరువ చేస్తూ, పారదర్శకంగా, బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని పేర్కొన్నారు. పోలీసు శాఖపై ప్రజల్లో నమ్మకాన్ని మరింత బలోపేతం చేయడమే లక్ష్యమని ఎస్పీ డా. జి. జానకి షర్మిల తెలిపారు.

# వాసవి క్లబ్ ఆధ్వర్యంలో అంజయ్యస్వామి జన్మదిన వేడుకలు



గజ్వేల్, 12 అక్టోబర్ 2026 (విజన్ ఆంధ్ర) :సిద్దిపేట జిల్లా గజ్వేల్ పట్టణం అంగడిపేట శ్రీ ఆంజనేయ స్వామి ఆలయ ప్రాంగణంలో వాసవి క్లబ్ ఆధ్వర్యంలో ప్రముఖ ఆధ్యాత్మిక వేత్త, యాదాద్రి భువనగిరి జిల్లా కాచారం శ్రీ వాసవి రేణుకా ఎల్లమ్మ బసవ లింగేశ్వర ఆలయ వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ వంగపల్లి అంజయ్యస్వామి జన్మదిన వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వాసవి క్లబ్ దుర్గామాత మండపంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, భక్తులకు అరటిపండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గజ్వేల్ ప్రజ్ఞాపూర్ వాసవి క్లబ్ అధ్యక్షుడు గంగిశెట్టి వెంకటేశం మాట్లాడుతూ అంజయ్య స్వామి ప్రజలను భక్తి మార్గంలో నడిపిస్తూ, ప్రతి మంగళవారం ఆలయంలో అన్నదానం వంటి సామాజిక, ఆధ్యాత్మిక సేవా కార్యక్రమాలు చేస్తూ పలువురికి ఆదర్శంగా నిలుస్తున్నారన్నారు. ఆయన నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలు, అష్టైశ్వర్యాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో తొడుపునూరి కాశీనాథ్, గంగిశెట్టి ఉమేష్, కైలాస ప్రశాంత్, రామారం రమేష్, వాసవి క్లబ్ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

# భక్తిపారవశ్యంలో మహిళలు.. అమ్మవారి దీక్షల్లో యువతులు

– భైంసాతో పాటు పలు గ్రామాల్లో నవరాత్రి దీక్షలు
– నియమ నిష్ఠలతో పూజలు.. ఉపవాసాలతో అమ్మవారి అనుగ్రహం కోసం ప్రార్థనలు



భైంసా :అక్టోబర్ 12(విజన్ ఆంధ్ర) : దేవి శరన్నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని భైంసా పట్టణంతో పాటు పరిసర గ్రామాల్లో మహిళలు, యువతులు అమ్మవారి దీక్షలు స్వీకరించి భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహిస్తున్నారు. కఠిన నియమ నిష్ఠలను పాటిస్తూ ఉపవాసాలు, ప్రత్యేక పూజలు, నైవేద్యాల సమర్పణతో అమ్మవారి అనుగ్రహం కోసం ప్రార్థిస్తున్నారు. దీంతో పట్టణం, గ్రామాల్లో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది.

**నిష్ఠతో పూజలు.. భక్తితో ఉపవాసాలు**

దీక్షలు స్వీకరించిన మహిళలు ప్రతిరోజూ ఉదయం, సాయంత్రం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తూ పూలు, పండ్లు, నైవేద్యాలను సమర్పిస్తున్నారు. ఉపవాసాలు పాటిస్తూ దైవచింతనలో గడుపుతున్నారు. సంప్రదాయ ఆచారాలకు అనుగుణంగా నియమబద్ధమైన జీవనశైలిని అనుసరిస్తూ తమ భక్తిని చాటుకుంటున్నారు.

**యువతుల్లోనూ పెరుగుతున్న ఆధ్యాత్మిక ఆసక్తి**

మహిళలతో పాటు యువతులు సైతం అమ్మవారి దీక్షలు స్వీకరించి నిష్ఠతో కొనసాగిస్తున్నారు. చదువులు, కుటుంబ బాధ్యతలను నిర్వహిస్తూనే దీక్షా నియమాలను పాటిస్తున్నారు. పాదరక్షలు ధరించకుండా నడవడం, సాత్విక ఆహారం తీసుకోవడం, ఉపవాసాలు పాటించడం వంటి ఆచారాలను అనుసరిస్తున్నారు. దీక్షల ద్వారా ఆత్మనిగ్రహం, క్రమశిక్షణ అలవడతాయని వారు విశ్వసిస్తున్నారు.

**ఆత్మనిగ్రహానికి ప్రతీకగా దీక్షలు**

నవరాత్రి దీక్షలు భక్తితో పాటు ఆత్మనిగ్రహం, క్రమశిక్షణ, మానసిక ప్రశాంతతకు ప్రతీకగా నిలుస్తాయని భక్తులు భావిస్తున్నారు. అమ్మవారి కృపతో కుటుంబాల్లో సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు కలగాలని ప్రార్థిస్తున్నారు. భక్తి, విశ్వాసం, సంప్రదాయాల సమ్మేళనంగా కొనసాగుతున్న నవరాత్రి దీక్షలు భైంసాతో పాటు పరిసర గ్రామాల్లో ఆధ్యాత్మిక శోభను నింపుతున్నాయి.

# అష్ట గ్రామంలో ఘనంగా బతుకమ్మ వేడుకలు

**- బతుకమ్మను ఎత్తుకొని కోలాటం ఆడిన గ్రామ సర్పంచ్ రావుల లావణ్య శ్రీనివాస్**



ముధోల్ :అక్టోబర్ 12 (విజన్ ఆంధ్ర) : మండలంలోని అష్ట గ్రామంలో మహిళలు బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించారు. గ్రామ ప్రధాన రహదారులపై, బస్టాండ్ సమీపంలో మహిళలు బతుకమ్మలను ఎత్తుకొని కోలాటాలు ఆడుతూ సందడి చేశారు. రంగురంగుల పూలతో బతుకమ్మలను అందంగా అలంకరించి, భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. “బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో.. బంగారు బతుకమ్మ ఉయ్యాలో.. గౌరమ్మ ఉయ్యాలో” అంటూ పాటలు పాడుతూ వేడుకలను కనుల పండువగా జరుపుకున్నారు. ఈ వేడుకల్లో గ్రామ సర్పంచ్ రావుల లావణ్య శ్రీనివాస్ మహిళలతో కలిసి బతుకమ్మను ఎత్తుకొని కోలాటం ఆడుతూ సందడి చేశారు. మహిళలందరినీ కలుపుకొని బతుకమ్మ వేడుకల్లో పాల్గొనడం గ్రామస్తులను ఆకట్టుకుంది. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ, పదవి చేపట్టిన తర్వాత తొలిసారిగా గ్రామ మహిళలందరితో కలిసి బతుకమ్మ పండుగను నిర్వహించుకోవడం ఎంతో సంతోషంగా ఉందని తెలిపారు. బతుకమ్మ వేడుకలను పురస్కరించుకొని గ్రామంలోని ప్రధాన వీధుల్లో పారిశుధ్య పనులు చేపట్టి, రహదారులను శుభ్రం చేయడంతో పాటు బ్లీచింగ్ పౌడర్ చల్లించారు. అలాగే బతుకమ్మ ఆడే మహిళలకు ఇబ్బందులు కలగకుండా ఊర చెరువు సమీపంలో విద్యుత్ దీపాలు ఏర్పాటు చేశారు. వేడుకలు నిర్వహించే ప్రాంతంలో మొరం పోయించి అవసరమైన మరమ్మతులు చేయించారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్ సూర్గుల సావిత్రి కోటయ్య, గ్రామ మహిళలు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రజావాణి

## ఇన్చార్జి ఎంపీడీవో శ్రీధర్ బాబు



కాటారం డివిజన్ ప్రతినిధి, అక్టోబర్ 12 (విజన్ ఆంధ్ర): ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రజలు తమ అర్జీలను ప్రజావాణిలో అందించాలని జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాటారం మండలం ఇన్ ఛార్జీ మండల పరిషత్ అభివృద్ధి అధికారి మార్క శ్రీధర్ బాబు కోరారు. సోమవారం ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో తహసిల్దార్ నాగరాజు తో పాటు మండల స్థాయి పలు శాఖలకు చెందిన 17 మంది అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మూడు దరఖాస్తులు వచ్చాయని పేర్కొన్నారు. హౌసింగ్ డిపార్ట్మెంట్ కు సంబంధించిన అర్జీలను సంబంధిత శాఖలకు అందజేశారు. ప్రజా సమస్యల ను పరిష్కరించేందుకు సంబంధిత అధికారులు సత్వరమే చర్యలు చేపట్టాలని సూచించారు.

# కలెక్టర్‌కు ఘన సన్మానం



మహబూబ్‌నగర్, అక్టోబర్ 12 (విజన్ ఆంధ్ర) : జిల్లాలో వివిధ శాఖల్లో పనిచేస్తున్న 38 మంది నాల్గవ తరగతి ఉద్యోగులు,9 మంది రికార్డ్ అసిస్టెంట్ లు ప్రొబేషన్ కాలాన్ని పూర్తి చేసుకున్న సందర్భంగా సోమవారం జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తాను కలెక్టర్ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించి కృతజ్ఞత తెలిపారు.

ఈ సందర్భంగా కలెక్టర్ వారికి అభినందిస్తూ శుభాకాంక్షలు తెలిపారు. ఉద్యోగులు తమకు కేటాయించిన విధులను బాధ్యతాయుతంగా నిర్వహించాలని సూచించారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించేలా అంకితభావంతో పనిచేయాలని ఆమె పేర్కొన్నారు.

కార్యక్రమంలో టి ఎన్.జి.ఓ.జిల్లా అధ్యక్షులు రాజీవ్ రెడ్డి, నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు నరేందర్, కలెక్టరేట్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# బిట్స్ పాఠశాల చైర్మన్ పై క్రిమినల్ కేసులు పెట్టాలి



భూపాలపల్లి అక్టోబర్ 12 (విజన్ ఆంధ్ర )పట్టణంలో ని మహేశ్వర ఎడ్యుకేషనల్ సొసైటీ చైర్మన్ బిట్స్ పాఠశాల అధినేత డా ఏ రాజేంద్రప్రసాద్ పై క్రిమినల్ కేసులు పెట్టాలని గ్రీవెన్స్ సెల్ లో సమాచార హక్కు చట్టం కార్యకర్త కుసుమ రామకృష్ణ వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ భూపాలపల్లి పట్టణం లో చాలా సంవత్సరాలనుండి మూత పడిన శాంతినికేతన్ విద్యాలయం ను రెన్యువల్ మరియు షిఫ్టింగ్ చేయు సమయం లో తప్పుడు డాక్యుమెంట్స్ పెట్టి షిఫ్టింగ్ చేయడం జరిగింది. ఇట్టి విషయమై కుసుమ రామకృష్ణ శాంతినికేతన్ కి సంబందించిన పూర్తి ఫైల్ డీటెయిల్స్ సమాచార హక్కు చట్టం కింద అడుగగా శాంతినికేతన్ గుర్తింపు ను రద్దు చేసుకొని బిట్స్ పేరుమీద కొత్త ఫైల్ వేసి ఓపెనింగ్ పర్మిషన్ తీసుకోవడం జరిగింది. అలాగే శాంతినికేతాన్ పాఠశాలకు సంబందించిన యూ డైజ్ లో ఉన్నా విద్యార్థుల లకు సంబందించిన అడ్మిషన్లు భూపాలపల్లి బిట్స్ పాఠశాలలో నమోదు చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ విధంగా ప్రభుత్వాన్ని మోసం చేసిన బిట్స్ విద్యాసంస్థల చైర్మన్ రాజేంద్ర ప్రసాద్ పై క్రిమినల్ కేసులు పెట్టడం తో పాటు మహేశ్వర ఎడ్యుకేషనల్ సొసైటీ పేరుమీద ఉన్నా బిట్స్ విద్యాసంస్థల గుర్తింపు రద్దు చేయాలని రామకృష్ణ జిల్లా కలెక్టర్ కి విజ్ఞప్తి చేశారు.

## కూతురిని లైంగికంగా వేధించడముతో ఓపిక నశించి

# భర్తను కళ్ళలో కారం చల్లి చెట్టుకు కట్టేసి చంపిన భార్య

కూడా జరుగుతున్నాయని తెలిపారు.దింతో భగవాన్ ఇంటి వద్ద కూడా తీవ్ర ఘర్షణ జరగడంతో రాజేశ్వరి తన పుట్టింటికి సేవాలాల్ తండకు వచ్చింది. ఆదివారం రోజున తన భర్త భగవాన్ మద్యం మత్తులో రాజేశ్వరి తల్లి గారి ఇంటికి వచ్చి తీవ్ర గొడవకు చేయడముతో కూతురుతో అలా ప్రవర్తించవద్దని నచ్చచెప్పే ప్రయత్నం చేసినప్పటికీ వినకపోవడముతో ఓపిక నశించిన భార్య రాజేశ్వరి భర్త కళ్లల్లో కారం చల్లి,చెట్టుకు కట్టేసి రాడుతూ ఆవేశములో బాదడముతో భగవాన్ అక్కడికక్కడే మృతి చెందాడు.భర్త చనిపోయినట్టు అనుమానం రాగానే ఆమె నేరుగా వెళ్లి పోలీసులకు లొంగిపోయిందన్నారు. మృతుని తండ్రి లక్ష్మణ్ ఫిర్యాదు చేయడంతో వెంటనే హుస్నాబాద్ సీఐ శ్రీధర్, అక్కన్నపేట ఎస్సై ప్రశాంత్ సంఘటన స్థలానికి చేరుకొని వెంటనే కేసు నమోదు చేసుకొని పోలీసులు భగవాన్ మృతదేహాన్ని పోస్ట్ మార్టం తరలించారు.పోస్టుమార్టం పూర్తి అయిన వెంటనే భగవాన్ శవాన్ని బంధువులకు అప్పగించామన్నారు.ఈ సమావేశంలో సీఐ శ్రీధర్ అక్కన్నపేట ఎస్సై ప్రశాంత్ పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# అభివృద్ధి పేరుతో అశాస్త్రీయ రోడ్డు విస్తరణ తగదు!

## సింగరేణి ఉద్యోగుల సంఘ భవనాన్ని కూల్చే కుట్రను అడ్డుకోవాలి

## - చిరు వ్యాపారులకు న్యాయం చేయాలి

## -పౌర హక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు ప్రొఫెసర్ గడ్డం లక్ష్మణ్, తెలంగాణ విద్యావంతుల వేదిక జిల్లా అధ్యక్షులు రాదండి దేవేందర్



భూపాలపల్లి అక్టోబర్ 12 (విజన్ ఆంధ్ర ) జిల్లా కేంద్రంలో అభివృద్ధి పేరుతో చేపడుతున్న రోడ్డు విస్తరణ కార్యక్రమం శాస్త్రీయంగా, న్యాయబద్ధంగా ఉండాలని పౌర హక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు ప్రొఫెసర్ గడ్డం లక్ష్మణ్ అన్నారు. రోడ్డు విస్తరణ పేరుతో ప్రజల హక్కులకు భంగం కలిగించడం, ప్రజా ఉద్యమాలకు అండగా నిలిచే సంఘాల భవనాలను కూల్చే పరిస్థితులు సృష్టించడం సమంజసం కాదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. భూపాలపల్లి పట్టణంలో కేవలం మూడు, నాలుగు కిలోమీటర్ల పరిధిలో 200 అడుగుల వెడల్పుతో రహదారి విస్తరణ చేపట్టాలనే విధానం పలు అనుమానాలకు తావిస్తోందని ఆయన పేర్కొన్నారు. ఈ విస్తరణలో భాగంగా ప్రజల గొంతుకగా నిలిచిన తెలంగాణ సింగరేణి ఉద్యోగుల సంఘానికి చెందిన భవనాన్ని కూల్చే కుట్ర జరుగుతోందనే ఆందోళన వ్యక్తం చేశారు. అభివృద్ధి అనేది ప్రజలకు మేలు చేయాలి తప్ప, ప్రజాసంఘాల ఉనికిని దెబ్బతీసే విధంగా ఉండకూడదని స్పష్టం చేశారు.

తెలంగాణ విద్యావంతుల వేదిక భూపాలపల్లి జిల్లా అధ్యక్షులు రాదండి దేవేందర్ మాట్లాడుతూ, రోడ్డు విస్తరణలో అధికారులు ఒక స్పష్టమైన విధానాన్ని అనుసరించాలని డిమాండ్ చేశారు. రహదారి ఎక్కడ 200 అడుగుల వెడల్పుతో ప్రారంభమవుతుందో, చివరి వరకు అదే కొలతతో విస్తరణ చేపట్టాలని సూచించారు. ఒకవేళ విస్తరణలో కొలతల విషయంలో ఏకరూపత పాటించని పక్షంలో, తెలంగాణ సింగరేణి ఉద్యోగుల సంఘ భవనానికి మినహాయింపు ఇవ్వాలని కోరారు. అభివృద్ధి పేరుతో ఒకచోట ఒక విధంగా, మరోచోట మరో విధంగా నిబంధనలు అమలు చేయడం వల్ల ప్రజల్లో అన్యాయానికి గురవుతున్నామనే భావన కలుగుతుందని దేవేందర్ అన్నారు. రోడ్డు విస్తరణలో పారదర్శకత పాటించాలని, ప్రభావితమయ్యే ప్రజలు, సంఘాల అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు.

చిరు వ్యాపారుల ఉపాధికి భరోసా కల్పించాలి రోడ్డు విస్తరణ కారణంగా ఇప్పటికే ఉపాధి కోల్పోయిన చిరు వ్యాపారులను ప్రభుత్వం, అధికారులు ఆదుకోవాలని దేవేందర్ కోరారు. ఎన్నో ఏళ్లుగా చిన్నచిన్న వ్యాపారాలు చేసుకుంటూ కుటుంబాలను పోషించుకుంటున్న వారి జీవనోపాధి దెబ్బతినడం ఆందోళనకరమన్నారు. అభివృద్ధి పనుల వల్ల నష్టపోయిన చిరు వ్యాపారులకు ప్రత్యామ్నాయ వ్యాపార స్థలాలు, ఉపాధి అవకాశాలు కల్పించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

రోడ్డు విస్తరించడం, పట్టణాన్ని అభివృద్ధి చేయడం అవసరమేనని, అయితే ఆ అభివృద్ధి ప్రజల హక్కులను కాపాడుతూ, ఉపాధిని పరిరక్షిస్తూ జరగాలని ఇరువురు అభిప్రాయపడ్డారు. అధికారులు ప్రజల అభ్యంతరాలను పరిశీలించి, రోడ్డు విస్తరణపై స్పష్టత ఇవ్వాలని, తెలంగాణ సింగరేణి ఉద్యోగుల సంఘ భవనాన్ని పరిరక్షించడంతో పాటు ఉపాధి కోల్పోయిన చిరు వ్యాపారులకు న్యాయం చేయాలని వారు డిమాండ్ చేశారు



## ఏకగ్రీవంగా నోబుల్ యూత్ అసోసియేషన్

# నూతన కార్యవర్గం ఎన్నిక

- అధ్యక్షుడు - శంకరంపేట నరేష్
- ప్రధాన కార్యదర్శి - వడ్ల సుమన్
- సమాజ సేవే లక్ష్యంగా మరింత ముందడుగు..!

మెదక్ /రేగోడ్ అక్టోబర్ 12(విజన్ ఆంధ్ర) : మండలం రేగోడ్ గ్రామానికి చెందిన నోబుల్ యూత్ అసోసియేషన్ (=వస్త్ర. చీశీ. 344/10) సభ్యులందరూ సమావేశమై సంఘం అభివృద్ధి, భవిష్యత్ కార్యాచరణపై చర్చించి నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. యువతలో ఐక్యత, సేవాభావం, సామాజిక బాధ్యతను పెంపొందిస్తూ గ్రామ అభివృద్ధికి కృషి చేయాలనే గొప్ప సంకల్పంతో నూతన కార్యవర్గం బాధ్యతలు స్వీకరించింది. సమాజంలో సానుకూల మార్పు తీసుకురావడం, యువతను మంచి మార్గంలో నడిపించడం, సేవా కార్యక్రమాల ద్వారా ప్రజలకు అండగా నిలవడం సంఘం ప్రధాన లక్ష్యాలుగా నిర్ణయించుకుంది. ఇట్టి ఎన్నికలో అసోసియేషన్ సభ్యులందరూ పాల్గొన్నారు. నూతన కార్యవర్గంలో భాగంగా అధ్యక్షులుగా శంకరంపేట నరేష్, -ప్రధాన కార్యదర్శిగా వడ్ల సుమన్, ఉప అధ్యక్షులు: పట్లోళ్ల సతీష్ కుమార్, బోయినీ వీర ప్రసాద్, కోశాధికారి కమ్మరి లక్ష్మీకాంత్, జాయింట్ సెక్రటరీ బోగం అనిల్, ఆర్గనైజింగ్ సెక్రటరీ మంగలి రాజు, సోషల్ మీడియా కోఆర్డినేటర్ సరాఫ్ శేఖర్, అడిషనల్ సెక్రెటరీ–బిజిలిపురం వంశీ, ఈసి మెంబర్స్ బి.సిద్దు, డి.హరీష్, జి.నవీన్, బి.నవీన్.విజయ్ కుమార్, డి.వంశీ, ఆర్.నిఖిల్. –లీగల్ అడ్వైజర్–దుద్యాల జగదీష్ లను ఎన్నుకున్నట్లు తెలిపారు.

# శ్రీకర్ సీడ్స్‌తో నష్టపోయాం, న్యాయం చేయండి

- -వరి సాగుతో నష్టాలు, డబ్బుల కోసం రైతుల ఎదురుచూపులు
- -శ్రీకర్ సీడ్స్ సంస్థపై చర్యలు తీసుకోవాలి
- -ప్రజావాణిలో రైతుల ఫిర్యాదు.
- -న్యాయం చేయాలని వేడుకోలు





హుస్నాబాద్ విజన్ ఆంధ్ర అక్టోబర్ 12 : సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ మండలంలోని తోటపల్లి గ్రామంలో పదిహేను మంది రైతులు దాదాపు యాభై ఎకరాలకు పైగా శ్రీకర్ సీడ్స్ కంపెనీ ప్రతినిధులు చెప్పిన మాటలు నమ్మి వరి సాగు చేసి తీవ్రంగా నష్టపోయామని, తమకు రావాల్సిన డబ్బులు ఇప్పించాలని కోరుతూ రైతులు ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. తమకు న్యాయం చేయడంతో పాటు సంబంధిత కంపెనీ ప్రతినిధులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ సందర్భంగా రైతులు తెలిపిన వివరాల ప్రకారం.. అంతకపేటకు చెందిన బదనపురం మొగిలి (రేషన్ డీలర్), జీలుగుల గ్రామానికి చెందిన మెరుగు శ్రీనివాస్‌రెడ్డి శ్రీకర్ సీడ్స్ కంపెనీకి సంబంధించిన వ్యవహారాల్లో తమను సంప్రదించారని పేర్కొన్నారు. తమ బావుల వద్దకు వచ్చి శ్రీకర్ సీడ్స్ వరి విత్తనాలు సాగు చేస్తే ఎకరానికి రూ.70 వేల వరకు చెల్లిస్తామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. వారి మాటలు నమ్మి గత యాసంగి సీజన్‌లో వరి సాగు చేయగా, ఎకరానికి రెండు నుంచి మూడు క్వింటాళ్ల దిగుబడి మాత్రమే వచ్చిందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. పండిన ధాన్యాన్ని తీసుకెళ్లినప్పటికీ తమకు చెల్లించాల్సిన డబ్బులు ఇవ్వలేదని ఆరోపించారు. ఈ విషయమై హుస్నాబాద్ సీఐ శ్రీధర్ ని కలిసి ఫిర్యాదు చేయగా, నెల రోజుల్లో డబ్బులు చెల్లిస్తామని రాతపూర్వకంగా హామీ ఇచ్చినట్లు రైతులు తెలిపారు. గడువు ముగిసిన తర్వాత తిరిగి సంప్రదించగా, డబ్బులు లేవని చెప్పడంతో పాటు తమకు న్యాయం జరగలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో సోమవారం ప్రజావాణిలో మరోసారి ఫిర్యాదు చేసినట్లు పేర్కొన్నారు. రాష్ట్ర మంత్రి, హుస్నాబాద్ ఎమ్మెల్యే పొన్నం ప్రభాకర్ స్పందించి, సంబంధిత కంపెనీ, ప్రతినిధులపై చట్టపరమైన చర్యలు తీసుకునేలా ఉన్నతాధికారులను ఆదేశించాలని, తమకు రావాల్సిన డబ్బులు ఇప్పించి ఆదుకోవాలని బాధిత రైతులు విజ్ఞప్తి చేశారు.

# సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ



మందమర్రి, అక్టోబర్ 12 (విజన్ ఆంధ్ర) : ఆర్థిక ఇబ్బందులతో వైద్య చికిత్స పొందలేక ఇబ్బందులు పడుతున్న మధ్య తరగతి కుటుంబాలకు సీఎంఆర్ఎఫ్ ఫండ్ సహాయ పడుతుందని రామకృష్ణాపూర్ కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు వోడ్నాల శ్రీనివాస్ అన్నారు. సోమవారం 13 మంది లబ్ధిదారులకు 5,52000 విలువ చేసే చెక్కులను లబ్ధిదారులకు అందించినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో పార్టీ కౌన్సిలర్లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నైపుణ్యాభివృద్ధికి జిల్లా విద్యాశాఖ, ఫౌండేషన్ ఫర్ ఫ్యూచర్ రెడీనెస్ సంస్థ మధ్య ఒప్పందం

## ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల్లో విద్యా నైపుణ్యాలు పెంపొందించడం, నాయకత్వ లక్షణాలు, ఆంగ్ల భాషా నైపుణ్యాల పెంపునకు చర్యలు: కలెక్టర్ ఖుష్బూ గుప్తా

మహబూబ్‌నగర్ : మహబూబ్‌నగర్ జిల్లాలో ఎంపిక చేసిన 26 ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల్లో విద్యా నైపుణ్యాలు పెంపొందించడం, విద్యార్థుల సమస్యలు తీర్చడం, వారిలో నాయకత్వ లక్షణాలు, ఆంగ్ల భాషలో మాట్లాడే సామర్థ్యాన్ని పెంపొందించేందుకు ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టనున్నట్లు జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా తెలిపారు. ఈ కార్యక్రమాల సమర్థవంతమైన అమలుకు జిల్లా విద్యాశాఖ, ఫౌండేషన్ ఫర్ ఫ్యూచర్ రెడీనెస్ సంస్థ మధ్య సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ సమక్షంలో అవగాహన ఒప్పందం (ఎంఓయూ) కుదిరింది.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించడంతో పాటు, భవిష్యత్తులో ఎదురయ్యే సవాళ్లను స్వయంగా ఎదుర్కొని పరిష్కరించుకునే సామర్థ్యాన్ని అభివృద్ధి చేయడంపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి దోహదపడే ఈ కార్యక్రమాలను నిర్దేశిత లక్ష్యాలకు అనుగుణంగా సమర్థవంతంగా అమలు చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో భాగంగా అక్టోబర్ చివరి వారంలో, నవంబర్ నెలలో ఎంపిక చేసిన 26 పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులకు అవగాహన, శిక్షణ కార్యక్రమాలు నిర్వహించనున్నారు. అనంతరం నాలుగు ప్రధాన అంశాలపై ప్రత్యేక కార్యక్రమాలను అమలు చేయనున్నారు.

యంగ్ ఒరేటర్స్ క్లబ్ ద్వారా విద్యార్థులకు తరగతి గదిలో, సభా



వేదికలపై స్పష్టంగా, ధైర్యంగా మాట్లాడే నైపుణ్యాలను నేర్పించనున్నారు. థింక్ అండ్ మేక్ కార్యక్రమం ద్వారా సమస్యలను గుర్తించడం, ప్రయోగాలు చేయడం, వాటికి స్వయంగా పరిష్కారాలను కనుగొనడం వంటి నైపుణ్యాలను అభివృద్ధి చేయనున్నారు. మనీ మ్యాటర్స్ కార్యక్రమం ద్వారా సంపాదన, ఖర్చులు, పొదుపు, బ్యాంకింగ్ తదితర అంశాలపై ప్రాథమిక ఆర్థిక అవగాహన కల్పించనున్నారు. కెరీర్ అవేర్‌నెస్ కార్యక్రమం ద్వారా ఉన్నత విద్యలో అందుబాటులో ఉన్న కోర్సులు, భవిష్యత్తులో ఎంచుకోదగిన వృత్తులపై విద్యార్థులకు అవగాహన కల్పించనున్నారు.

ఎంపిక చేసిన పాఠశాలల్లో ఈ కార్యక్రమాల అమలు తీరును ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ, నిర్దేశించిన లక్ష్యాలను సాధించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అధికారులకు సూచించారు.

ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా అమలు చేసేందుకు ఉపాధ్యాయులు, విద్యార్థుల సహకారం కీలకమని కలెక్టర్ పేర్కొన్నారు. సంబంధిత పాఠశాలల ఉపాధ్యాయులు, ఫౌండేషన్ ఫర్ ఫ్యూచర్ రెడీనెస్ సంస్థ ప్రతినిధులు సమన్వయంతో పనిచేస్తూ, విద్యార్థులు అన్ని శిక్షణ కార్యక్రమాలకు క్రమం తప్పకుండా హాజరయ్యేలా చూడాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు.

ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ అండర్ ట్రైనీ సాయి శివాని, జిల్లా విద్యాశాఖ అధికారి ఐ.విజయకుమారి, ఫౌండేషన్ ఫర్ ఫ్యూచర్ రెడీనెస్ సంస్థ ప్రతినిధులు కీర్తన, సంతోష్ ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

# అనారోగ్యం తో బాధపడుతూ మనస్థాపానికి గురై పురుగుల మందు తాగి మృతి చెందిన బాలిక



లింగాపూర్ అక్టోబర్ 12(విజన్ ఆంధ్ర )లింగాపూర్ మండలంలోని పీకలతాండ గ్రామానికి చెందిన పదవ తరగతి విద్యార్థి బోద మల్లేశ్వరి మహాగావ్ ఆశ్రమ పాఠశాలల్లో చదువుతున్నది దసరా సెలవులకు ఇంటికి వెళ్ళడంతో అనారోగ్యం బాగా లేకపోవడంతో మనస్థాపానికి గురై ఎవరు లేని సమయంలో పురుగుల తాగింది గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే జైనురు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా పరిస్థితి విషమించడంతో అదిలాబాద్ రిమ్స్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స చెందుతూ సోమవారం మృతి చెందింది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు లింగాపూర్ ఎస్సై సురేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్టు పేర్కొన్నారు.

# కొలం గిరిజనలకు ఇందిరమ్మ ఇల్లు మంజూరి చేయాలని,ఐ టీ డి ఏ,పి వో,కు వినతి పత్రాని అందజేత

లింగాపూర్ అక్టోబర్ 12(విజన్ ఆంధ్ర )లింగాపూర్ మండల కేంద్రంలోని ఘుమ్నూర్ (బి )గ్రామ పంచాయతీ లోని పవర్ గూడ గ్రామానికి చెందిన (పి వి టీ జి )కొలం గిరిజనులకు ప్రధాన మంత్రి ఆవాస్ యోజన కింద ఇందిరమ్మ ఇళ్ల మంజూరు చేయాలని ఐ టీ డి ఏ,పి వో మంద మకరందు కు వినతి పత్రానికి అందజేశారు.అనంతరం లింగూగూడ నుండి పవర్ గూడ వరకు రోడ్డు సౌకర్యం కల్పించాలి,పి వో కు వినవించారు పి వో వినతి పత్రాన్ని సానుకూలంగా స్పందించి సమస్య లను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు .ఈ కార్యక్రమం లోఘుమ్నూర్( ఎ)స్థానిక సర్పంచ్,శేస్ నారాయణ,గ్రామస్తులు పాల్గొన్నారు.



# సుమిత్ర నగర్ కనకదుర్గ ఆలయ నూతన ఉత్సవ కమిటీ ఎన్నిక

కూకట్ పల్లి (విజన్ ఆంధ్ర) అక్టోబర్ 13: సుమిత్ర నగర్లోని శ్రీ కనకదుర్గ అమ్మవారి ఆలయానికి శాసనసభ్యులు పీఏసీ చైర్మన్ అరెకపూడి గాంధీ , కాంగ్రెస్ నేత నాయినేని చంద్రకాంత్ రావు , సంజీవ్ రెడ్డి , ఆలయ ఈ ఓ శ్రీనివాస్ శర్మ ,ఆలయ జూనియర్ అసిస్టెంట్ భాస్కర్ రావు ఆధ్వర్యంలో నూతన ఉత్సవ కమిటీని ఎన్నుకోవడం జరిగింది. ఆలయ అభివృద్ధికి, అమ్మవారి ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో, ఘనంగా నిర్వహించేందుకు కమిటీ సభ్యులు సమిష్టిగా కృషి చేయాలని నిర్ణయించారు. ఈ కమిటీ లో సభ్యులుగా నాయినేని శ్రీలత చంద్రకాంత్ రావు, కాసర్ల లక్ష్మీనారాయణ రెడ్డి , ఆకుల రమాదేవి, జానకి , సాయి, మన్నె వేణు, శ్యామ్ రాజు , అనురాధ లను నియమించారు .

అమ్మవారి ఆశీస్సులతో ఆలయంలో నిర్వహించే పూజా కార్యక్రమాలు, పండుగలు మరియు ఇతర ఆధ్యాత్మిక కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహిస్తూ, భక్తులకు మరింత మెరుగైన సేవలు అందించడమే నూతన కమిటీ ప్రధాన లక్ష్యంగా ముందుకు సాగనుంది.



ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన ఉత్సవ కమిటీ సభ్యులకు అతిథులు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేసారు. శ్రీ కనకదుర్గ అమ్మవారి ఆశీస్సులు అందరిపై ఎల్లప్పుడూ ఉండాలని, కమిటీ ఆధ్వర్యంలో అన్ని కార్యక్రమాలు విజయవంతం కావాలని మనస్ఫూర్తిగా కోరుకున్నారు. కార్యక్రమంలో స్థానిక నేతలు, కమిటీ సభ్యులు , భక్తులు పాల్గొన్నారు.

# భరత్ నగర్ కాలనీలో ఘనంగా ఎంగిలిపూల బతుకమ్మ వేడుకలు

## పోచమ్మ ఆలయ ప్రాంగణంలో మహిళల కోలాహలం.. ముఖ్య అతిథులుగా ఏసీపీ నరేష్ రెడ్డి, కూకట్‌పల్లి ఎస్‌హెచ్‌ఓ స్వామి గౌడ్

కూకట్ పల్లి (విజన్ ఆంధ్ర) అక్టోబర్ 13: భరత్ నగర్ కాలనీ, మన జన ప్రగతి: భరత్ నగర్ కాలనీలోని శ్రీ పోచమ్మ ఆలయ ప్రాంగణంలో కాలనీ సంక్షేమ సంఘం, ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఎంగిలిపూల బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించారు. కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు డాక్టర్ పి. నాగిరెడ్డి, కమిటీ చైర్మన్, సభ్యుల పర్యవేక్షణలో జరిగిన ఈ వేడుకల్లో స్థానిక మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని బతుకమ్మలను అందంగా పేర్చి, ఆటపాటలతో సందడి చేశారు.

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా బాలానగర్ డివిజన్ ఏసీపీ పి. నరేష్ రెడ్డి, కూకట్‌పల్లి పోలీస్ స్టేషన్ హౌస్ ఆఫీసర్ స్వామి గౌడ్ హాజరయ్యారు. బతుకమ్మ వేడుకలు తెలంగాణ సంస్కృతి,



సంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తాయని, మహిళల ఐక్యతకు, సాంస్కృతిక వారసత్వ పరిరక్షణకు ఇలాంటి కార్యక్రమాలు దోహదపడతాయని ఈ సందర్భంగా పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో కాలనీ సంక్షేమ సంఘం సభ్యులు నాగేశ్వర్ రావు, మూర్తి, భిక్షపతి గౌడ్, బాబు, నరేష్ కుమార్, మధు, వెంకటేష్ యాదవ్, శారద, విజయ్ కుమార్, అర్చన, దీపా, బుచ్చిబాబు, డేవిడ్, అశోక్, రాజు, ఉమ, వెంకటేష్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు. మహిళలు సంప్రదాయబద్ధంగా బతుకమ్మ వేడుకలను జరుపుకోవడంతో ఆలయ ప్రాంగణం పండుగ శోభను సంతరించుకుంది.

# కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ వెంటనే రాజీనామా చేయాలి

## – టీపీసీసీ అధికార ప్రతినిధి డా. సత్యం శ్రీరంగం

కూకట్ పల్లి (విజన్ ఆంధ్ర) అక్టోబర్ 13: తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి పిలుపు మేరకు, టీపీసీసీ అధ్యక్షుడు శ్రీ మహేష్ కుమార్ గౌడ్ ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్రానికి చెందిన మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, టీపీసీసీ కార్యవర్గ సభ్యులు, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు, ఇతర పార్టీ నాయకులు పెద్ద ఎత్తున న్యూఢిల్లీలో నిర్వహించిన నిరసన కార్యక్రమంలో పాల్గొన్నారు. కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా టీపీసీసీ అధికార ప్రతినిధి డా. సత్యం శ్రీరంగం మాట్లాడుతూ, ఓటు హక్కు ప్రజాస్వామ్యానికి ప్రాణవాయువు వంటిదని, కోట్లాది మంది పౌరుల ఓటు హక్కుకు భంగం కలిగించే చర్యలు ప్రజాస్వామ్య పునాదులనే బలహీనపరుస్తాయని అన్నారు. ఓటర్ల జాబితాల నిర్వహణలో పారదర్శకత, జవాబుదారీతనం తప్పనిసరిగా ఉండాలని, ఓట్ల తొలగింపు, ఓటర్ల హక్కులకు విఘాతం కలిగిందనే ఆరోపణలపై సమగ్ర విచారణ జరగాలని డిమాండ్ చేశారు. ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షాల ప్రభావంలో ఎన్నికల సంఘం




పనిచేస్తోందనే అనుమానాలకు తావులేకుండా, ఎన్నికల సంఘం తన స్వతంత్రతను, నిష్పక్షపాత వైఖరిని నిరూపించుకోవాలని ఆయన పేర్కొన్నారు. ప్రజాస్వామ్యానికి అత్యంత కీలకమైన ఎన్నికల వ్యవస్థపై ప్రజలకు నమ్మకం సన్నగిల్లే పరిస్థితులు ఏర్పడటం దేశానికి ప్రమాదకరమని అన్నారు.

"ఓటు చోరీ అంటే ప్రజల తీర్పును దొంగిలించడమే. ప్రజల ఓటు హక్కును హరించడం రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధం. కోట్లాది మంది ఓటర్ల హక్కులపై ప్రశ్నలు తలెత్తుతున్నప్పుడు ఎన్నికల సంఘం మౌనంగా ఉండకూడదు. ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ నైతిక బాధ్యత వహించి వెంటనే రాజీనామా చేయాలి. ఆయన హయాంలో తీసుకున్న వివాదాస్పద నిర్ణయాలపై సమగ్ర, నిష్పక్షపాత పునఃసమీక్ష జరగాలి. చట్టవిరుద్ధ చర్యలు నిర్ధారణ అయితే బాధ్యులపై చట్టప్రకారం తగిన చర్యలు తీసుకోవాలి" అని డా. సత్యం శ్రీరంగం డిమాండ్ చేశారు. ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించడం, రాజ్యాంగ విలువలను కాపాడటం, ప్రతి పౌరుడి ఓటు హక్కును సంరక్షించడం కాంగ్రెస్ పార్టీ ప్రధాన లక్ష్యాలని ఆయన స్పష్టం చేశారు. ప్రజల ఓటుతో ఏర్పడే ప్రభుత్వాల విషయంలో పారదర్శకత, ఎన్నికల ప్రక్రియలో నిష్పక్షపాత వైఖరి అత్యంత అవసరమని తెలిపారు. ఈ నిరసన కార్యక్రమంలో దేశవ్యాప్తంగా ఇండియా కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొని న్యూఢిల్లీలో ప్రదర్శనలు నిర్వహించారు. ఎన్నికల వ్యవస్థలో పారదర్శకత, జవాబుదారీతనం, ఓటర్ల హక్కుల పరిరక్షణ కోసం తమ నిరసనను వ్యక్తం చేశారు. ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం, ప్రతి ఓటు విలువను కాపాడటం కోసం కాంగ్రెస్ పార్టీ తన పోరాటాన్ని నిరంతరం కొనసాగిస్తుందని డా. సత్యం శ్రీరంగం స్పష్టం చేశారు.



## కలెక్టరేట్‌లో ఘనంగా మూడో రోజు బతుకమ్మ వేడుకలు

మహబూబ్‌నగర్ : మహబూబ్‌నగర్ జిల్లా కలెక్టరేట్‌లో సోమవారం మూడో రోజు బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించారు. రెవెన్యూ అదనపు కలెక్టర్ జె.ఎల్.బి. హరిప్రియ, జిల్లా రెవెన్యూ అధికారి ఏ. నిర్మల, జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారి జరీనా బతుకమ్మకు పూజలు నిర్వహించి వేడుకలను ప్రారంభించారు.

ఈ సందర్భంగా మహిళా, శిశు సంక్షేమ శాఖ, పశుసంవర్ధక శాఖ, ముఖ్య ప్రణాళిక శాఖ, గృహ నిర్మాణ శాఖలకు చెందిన మహిళా ఉద్యోగినులు రంగురంగుల పూలతో అలంకరించిన బతుకమ్మలతో పాల్గొన్నారు. సంప్రదాయ బతుకమ్మ పాటలు పాడుతూ ఉత్సాహంగా బతుకమ్మ ఆడారు. మహిళల ఆటపాటలతో కలెక్టరేట్ ప్రాంగణంలో పండుగ వాతావరణం నెలకొంది.

## ప్రజావాణి లొ సమస్యల పరిష్కారం కోసం ఫిర్యాదులుఇవ్వండి

### -ఎంపీడీవో తరుణ్

నాగర్ కర్నూల్ జిల్లా,(ఫోటో జర్నలిస్ట్ మల్లేష్ బాబు) తెలకపల్లి మండల కాంప్లెక్స్ లో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమంలో ప్రజలు తమ సమస్యల పరిష్కారానికి ఫిర్యాదులు వినతి పత్రాలు సమర్పించాలని ఎంపీడీవో తరుణ్ కోరారు ప్రతి సోమవారం మండల కాంప్లెక్స్ లో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమంలో అధికారులకు తమ సమస్యలను వివరించి వినతి పత్రాలు సమర్పిస్తే సమస్యలు పరిశీలించి పరిష్కరించనున్నట్లు ఎంపీడీవో తరుణ్ తెలిపారు, ప్రజావాణిలో తహసిల్దార్ విజయ్ కుమార్, ఎంఈఓ చెన్ రెడ్డి శ్రీనివాస్ రెడ్డి , 20 మంది అధికారులు హాజరయ్యారు.



# ఆదిలాబాద్ జిల్లా న్యూ రాంపూర్ గ్రామ విడిసి సభ్యులు, బెల్ట్ షాపు నిర్వాహకుడిపై కేసు నమోదు

- బెల్ట్ షాపు నిర్వహణకు రూ.50 వేలతో వేలం నిర్వహణ
- బెల్ట్ షాపు నుంచి రూ.17 వేల విలువైన మద్యం స్వాధీనం
- నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే చట్టపరమైన చర్యలు తప్పవు.... రూరల్ ఎస్సై వి విష్ణువర్ధన్.లి

ఆదిలాబాద్ బ్యూరో అక్టోబర్ 12 (విజన్ ఆంధ్ర)ఆదిలాబాద్ రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని న్యూ రాంపూర్ గ్రామంలో నిబంధనలకు విరుద్ధంగా గ్రామ విడిసి ఏర్పాటు చేసి, దాని ద్వారా బెల్ట్ షాపు నిర్వహణకు రూ. 50 వేలతో వేలం నిర్వహించిన వ్యవహారంలో విడిసి సభ్యుడు శాలికిరావు మరియు మరికొందరిపై ఆదిలాబాద్ రూరల్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసినట్లు రూరల్ ఎస్సై వి. విష్ణువర్ధన్ తెలిపారు.

అదేవిధంగా, వేలం ద్వారా బెల్ట్ షాపు నిర్వహిస్తున్న నిర్వాహకుడు ఆనందరావుపై కూడా కేసు నమోదు చేసినట్లు ఎస్సై వెల్లడించారు. పోలీసులు బెల్ట్ షాపుపై చర్యలు చేపట్టి, సుమారు రూ. 17 వేల విలువైన మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు.

గ్రామ విడిసిలు నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తూ అక్రమంగా మద్యం విక్రయాలకు లేదా అక్రమ ఇసుక రవాణాకు వేలం నిర్వహించడం వంటి చట్టవిరుద్ధ కార్యకలాపాలకు పాల్పడితే సంబంధిత వ్యక్తులపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని ఎస్సై హెచ్చరించారు.




గ్రామాల్లో శాంతిభద్రతలకు విఘాతం కలిగించే, చట్టవిరుద్ధమైన కార్యకలాపాలకు ఎవరూ పాల్పడవద్దని సూచించారు.

### హెచ్ఎంటీ శాతవాహన నగర్‌లో నూతన దుకాణాలు, సిబ్బంది

# వసతి గృహం ప్రారంభం

- ముఖ్య అతిథిగా పాల్గొన్న పీఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ

కూకట్ పల్లి (విజన్ ఆంధ్ర) అక్టోబర్ 13: శంషిగూడ, హైదర్‌నగర్ డివిజన్ల పరిధిలోని హెచ్ఎంటీ శాతవాహన నగర్ కమ్యూనిటీ హాల్ ప్రాంగణంలో నూతనంగా నిర్మించిన దుకాణాలు, సిబ్బంది వసతి గృహాన్ని పీఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు దొడ్ల వెంకటేష్ గౌడ్, నార్నె శ్రీనివాసరావు, ఉప్పలపాటి శ్రీకాంత్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆరెకపూడి గాంధీ మాట్లాడుతూ.. కమ్యూనిటీ హాల్ ప్రాంగణంలో నూతన దుకాణాలు, సిబ్బంది వసతి గృహం అందుబాటులోకి రావడం సంతోషకరమన్నారు. సిబ్బందికి వసతి సౌకర్యం కల్పించడం అభినందనీయమని, నూతనంగా నిర్మించిన వసతి గృహం సిబ్బందికి ఎంతగానో ఉ



పయోగపడుతుందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో హెచ్ఎంటీ శాతవాహన నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు పి. రత్న ప్రసాద్, ఉపాధ్యక్షుడు ఎం. బాబు రావు, ప్రధాన కార్యదర్శి ఎం. యాది రెడ్డి, కార్యనిర్వాహక కార్యదర్శులు వి. వెంకటరావు, ఎస్. రామనాధంతో పాటు హెచ్ఎంటీ శాతవాహన నగర్ హౌస్ బిల్డింగ్ సొసైటీ కార్యవర్గ సభ్యులు, శ్రీ ఉమా మహేశ్వర ఆలయ కమిటీ సభ్యులు, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

# జలాల సంరక్షణ కోసం చివరి ఊపిరి వరకు కృషి సాగిస్తా




### -శాశ్వత కరవు నివారణకు సమగ్ర వ్యూహం అవసరం

### -ఎన్ డిఎంఏ మాజీ ఉపాధ్యక్షులు మర్రి శశిధర్ రెడ్డి

సంగారెడ్డి : జలాల సంరక్షణ కోసం చివరి ఊపిరి వరకు తన కృషి కొనసాగుతుందని జాతీయ విపత్తు నిర్వహణ ప్రాధికార సంస్థ మాజీ ఉపాధ్యక్షులు, డాక్టర్ మర్రి చెన్నారెడ్డి మెమోరియల్ ట్రస్ట్ కార్యదర్శి మర్రి శశిధర్ రెడ్డి అన్నారు.

వాతావరణ మార్పులు, ఎల్‌నినో ప్రభావంతో పెరుగుతున్న కరవును ఎదుర్కొనేందుకు తాత్కాలిక చర్యలకు బదులుగా శాశ్వత పరిష్కారాలపై దృష్టి సారించాలని ఆయన సూచించారు. సోమవారం నాడు బషీర్ బాగ్ ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, దేశవ్యాప్తంగా 'చతుర్విధ జల ప్రక్రియ' (ఫోర్ వాటర్స్ కాన్సెప్ట్)ను అమలు చేయడం ద్వారా కరవు నివారణ సాధ్యమని పేర్కొన్నారు. ఎల్‌నినో ప్రభావంతో మహారాష్ట్ర, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో వర్షపాతం లోటు, నీటి నిల్వల తగ్గుదలతో వ్యవసాయం దెబ్బతింటోందని తెలిపారు. గతంలోనూ వరుస కరువులు భూగర్భ జలాలను అడుగంటించి, గ్రామీణ ప్రజల జీవనోపాధిని దెబ్బతీశాయని పేర్కొన్నారు.

నాలుగు నీటి విధానంతో ప్రయోజనాలు ఉన్నాయన్నారు. దివంగత నీటిపారుదల నిపుణుడు టి. హనుమంతరావు రూపొందించిన ఈ విధానాన్ని 2001లో తెలంగాణ, రాయలసీమ ప్రాంతాల్లో అమలు చేయగా మంచి ఫలితాలు వచ్చాయని వివరించారు. సంగారెడ్డి జిల్లా గొట్టిగారిపల్లి గ్రామం వరుస కరవులను తట్టుకుని మూడు పంటలకు నీటిని అందించిందని తెలిపారు. రాజస్థాన్‌లోనూ ఈ విధానాన్ని అమలు చేసినట్లు పేర్కొన్నారు. వర్షపు నీటి సంరక్షణ, భూగర్భ జలాల పెంపు, నేలకోత నివారణ, కరవు కాలంలోనూ నీటి లభ్యత ఈ విధానం ప్రధాన ప్రయోజనాలని వివరించారు. ప్రస్తుత అంచనాల ప్రకారం ఎకరాకు సుమారు రూ.15 వేల వ్యయంతో అమలు చేయవచ్చని తెలిపారు. దేశంలోని వర్షాధార భూముల్లో ఈ విధానాన్ని విస్తరించడం ద్వారా రైతులకు నీటి భద్రత కల్పించడంతో పాటు, కరవు సహాయక చర్యలపై ప్రభుత్వ వ్యయాన్ని తగ్గించవచ్చని మర్రి శశిధర్ రెడ్డి అభిప్రాయపడ్డారు. ఈ విషయంలో తాను ప్రధాని నరేంద్రమోడీని కలిసి, దేశవ్యాప్తంగా దీని అమలుకు అభ్యర్థించనున్నట్లు ఆయన తెలిపారు. ఈ సమావేశంలో జస్టిస్ సుభాషన్ రెడ్డి ట్రస్ట్ నిర్వాహకులు ఇంద్రసేనారెడ్డి కూడా పాల్గొన్నారు.



# శేరి వెంకటాపూర్‌లో వైభవంగా నవరాత్రి ఉత్సవాలు.. గాయత్రీ మాతగా అమ్మవారి దర్శనం!

కోయిలకొండ,అక్టోంబర్ 12( విజన్ ఆంధ్ర) : కోయిలకొండ మండల పరిధిలోని శేరి వెంకటాపూర్ గ్రామంలో శరన్నవరాత్రి ఉత్సవాలు అత్యంత వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాలలో భాగంగా రెండవ రోజు అమ్మవారు పవిత్రమైన గాయత్రీ మాత రూపంలో భక్తులకు కనువిందుగా దర్శనమిచ్చారు.?వేద పండితుల మంత్రోచ్ఛారణల మధ్య, వేదయుక్తంగా మరియు సాంప్రదాయ పద్ధతుల్లో అమ్మవారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ప్రతిరోజు అమ్మవారిని ప్రత్యేకంగా పట్టు వస్త్రాలతో అలంకరించి, భక్తిశ్రద్ధలతో కుంకుమార్చనలు జరుపుతున్నారు.?ఈ పవిత్ర పూజా కార్యక్రమంలో పరిసర ప్రాంతాల నుండి వచ్చిన అమ్మవారి మాలధారణ భక్తులు, గ్రామ పెద్దలు, యువజన సంఘాల సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారి తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఉత్సవాల సందర్భంగా గ్రామంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది.

# కార్యదర్శులకు అందజేయండి

వాజేడు,అక్టోబర్12(విజన్ ఆంధ్ర):ఇంటింటికి ఇందిరమ్మ కుట్టు మిషన్లకు (బీసీ మహిళలకు) సంబంధించిన ఆన్లైన్లో అప్లై చేసిన లబ్ధిదారులు అప్లికేషన్లను గ్రామపంచాయతీ కార్యదర్శులకు అందజేయాలని వాజేడు ఎంపీడీవో కృపాకర్ ఓ పత్రిక ప్రకటనలో సోమవారం తెలిపారు

# తలమడుగు మండలాన్ని కరువు మండలము గా ప్రకటించండి

## ఆదివాసీ సంఘాల నాయకులు డిమాండ్

ఆదిలాబాద్ బ్యూరో : అక్టోబర్ 12 (విజన్ ఆంధ్ర)ఆదిలాబాద్ జిల్లా తలమడుగు మండల ఆదివాసి సంఘాల తరపున తలమడుగు తహిసిల్దార్ ను కలిసి మెమోరండం అందజేశారు. ఈ సందర్భంగా ఆదివాసి నాయకులు మాట్లాడుతూ ఈ సంవత్సరం ఎల్ నీ నో ప్రభావంతో తక్కువ వర్షపాతం నమోదు కావడంతో రైతులు తీవ్రంగా నష్టపోవడంతో పంటలు సరిగ్గా పండగ పోవడంతో అప్పుల పాలు అయ్యారు కావున రైతుల బ్యాంకు ద్వారా తీసుకున్న పంట రుణాలను, ఇటీవల అప్పులతో ఆత్మహత్య చేసుకున్న రైతులను ఒక్కొక్కరికి 20 లక్షల రూపాయల ఎక్స్గ్రేషియా ఇచ్చి ఆదుకోవాలని, తలమడుగు మండలాన్ని కరువు ప్రాంతంగా ప్రకటించి ఆదుకోవాలని ఆదివాసి హక్కుల పోరాట సమితి, తుడుం దెబ్బ, ఆదివాసి సంక్షేమ పరిషత్ తలమడుగు వివిధ గ్రామాల పటేల్ మహాజన్, దేవారి, సర్పంచ్లు, మాజీ సర్పంచులు, మాజీ ఎంపీటీసీలు ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆదివాసీ తుడుందెబ్బ జిల్లా ఉపాధ్యక్షు లు



కుమ్రం జ్ఞానేశ్వర్, మండల అధ్యక్షులు జంగాల పోచన్న , మండల్ వర్కింగ్ ప్రెసిడెంట్ గోడం భుజంరావు, ఆదివాసి సంక్షేమ పరిషత్ కార్యదర్శి ఆత్రం అంకుష్, ఝు రి సర్పంచ్ రూపా కాశిరాం, పేందూరు జైతు పటేల్, పెందూర మాధవరావు మహాజన్, నైతం రాము పటేల్, నైతం లక్ష్మణ్, సలాం రవీందర్, మెస్రం దేవరావు పటేల్, కోవా గోవిందరావు, మాజీ సర్పంచ్ మెస్రంవిలాస్, సూర్య బాన్, సోయంమాణిక్ రావు, తుడసం హేమంత్, పేందూరు రాము, తదితరులు పాల్గొన్నారు

# దుర్గాదేవి నవరాత్రి పూజా కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్

**శాకంబరీ మాత ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన జిల్లా ఎస్పీ.**

**జిల్లా ప్రజలందరికీ దుర్గా నవరాత్రి శుభాకాంక్షలు.**

**భక్తిశ్రద్ధలతో నవరాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహించుకోవాలి.**

ఆదిలాబాద్ బ్యూరో అక్టోబర్ 12 (విజన్ ఆంధ్ర)ఆదిలాబాద్ పట్టణంలోని బుక్తాపూర్‌లో ఉన్న శాకంబరీ మాత ఆలయం లో ఆలయం వద్ద ఏర్పాటుచేసిన దుర్గా దేవి నవరాత్రి పూజా కార్యక్రమంలో జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయం ఎదురుగా ఏర్పాటు చేసిన దుర్గామాత విగ్రహానికి నిర్వహించిన పూజా కార్యక్రమాల్లో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు.

ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ జిల్లా ప్రజలందరికీ దుర్గా నవరాత్రి శుభాకాంక్షలు తెలియజేశారు. దుర్గా నవరాత్రులు భక్తి, ఆధ్యాత్మికత, శక్తి ఆరాధనకు ప్రతీకలని, ఈ పవిత్ర పండుగను ప్రజలందరూ భక్తిశ్రద్ధలతో, ఆనందోత్సాహాలతో ఘనంగా



నిర్వహించుకోవాలని ఆకాంక్షించారు.

నవరాత్రి ఉత్సవాల సందర్భంగా ఆలయాలకు వచ్చే భక్తులు భక్తి భావంతో పూజా కార్యక్రమాల్లో పాల్గొని, పండుగ వాతావరణాన్ని ఆనందంగా ఆస్వాదించాలని తెలిపారు. ఉత్సవాల నిర్వహణలో నిర్వాహకులు, భక్తులు పరస్పర సహకారంతో వ్యవహరిస్తూ ప్రశాంతమైన వాతావరణాన్ని కొనసాగించాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు, భక్తులు, పోలీస్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# టీజీ ఎన్పీడీసీఎల్‌లో ఘనంగా బతుకమ్మ సంబురాలు

హనుమకొండ జిల్లా ప్రతినిధి అక్టోబర్ 12, ( విజన్ ఆంధ్ర ): తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు నిలువెత్తు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగ మహిళల ఐక్యతకు, ప్రకృతి ఆరాధనకు, ఆత్మీయ అనుబంధాలకు ప్రతీక అని టీజీఎన్పీడీసీఎల్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ కర్నాటి వరుణ్ రెడ్డి, ఐఏఎస్ అన్నారు.

సోమవారం హనుమకొండ నక్కలగుట్ట లోని ప్రధాన కార్యాలయంలో బతుకమ్మ వేడుకలను అత్యంత వైభవంగా, ఆనందోత్సాహాల మధ్య నిర్వహించారు. ఈ వేడుకలకు సీఎండీ ముఖ్య అతిథిగా హాజరై మహిళా ఉద్యోగులకు బతుకమ్మ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ అస్తిత్వానికి, సాంస్కృతిక వైభవానికి బతుకమ్మ పండుగ ప్రత్యేక గుర్తింపును తీసుకువచ్చిందన్నారు. తీరొక్క పూలతో ప్రకృతిని పూజించే విశిష్ట సంప్రదాయం తెలంగాణకే సొంతమని పేర్కొన్నారు. తొమ్మిది రోజుల పాటు మహిళలు భక్తిశ్రద్ధలతో గౌరీదేవిని ఆరాధిస్తూ, బతుకమ్మలను పేర్చి ఆటపాటలతో సంబురాలు జరుపుకోవడం మన సంస్కృతిలోని

**తీరొక్క పూలతో జరుపుకునే గొప్ప పండుగ బతుకమ్మ.**

**తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక..**

**ప్రకృతిని ఆరాధిస్తూ మహిళలు ఆనందోత్సాహాలతో జరుపుకునే పండుగ**

**టీజీఎన్పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి, ఐఏఎస్**

గొప్పతనాన్ని చాటుతుందన్నారు.

చిన్నాపెద్దా తారతమ్యం లేకుండా మహిళలందరూ ఒకేచోట చేరి బతుకమ్మ పాటలు పాడుతూ ఆనందంగా గడపడం సామాజిక ఐక్యతకు, సోదరీభావానికి నిదర్శనమన్నారు. ప్రకృతి ప్రసాదించిన రంగురంగుల పూలతో బతుకమ్మలను అందంగా పేర్చి పూజించడం పర్యావరణ పరిరక్షణ ప్రాముఖ్యతను తెలియజేస్తుందని పేర్కొన్నారు.

భావితరాలకు తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను అందించడంలో ఇటువంటి పండుగలు కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు. హనుమకొండ, వరంగల్ సర్కిళ్లతో పాటు వివిధ ఈఆర్వో కేంద్రాలకు చెందిన మహిళా ఉద్యోగులు తీరొక్క పూలతో అందంగా అలంకరించిన భారీ బతుకమ్మలతో విద్యుత్ భవన్‌కు తరలివచ్చారు. సంప్రదాయ వస్త్రధారణలో మహిళలు బతుకమ్మల చుట్టూ చేరి ఆటపాటలతో సందడి చేశారు. రంగురంగుల పూల బతుకమ్మలు, మహిళల కోలాహలం, సంప్రదాయ గీతాలతో విద్యుత్ భవన్ ప్రాంగణమంతా పండుగ శోభను సంతరించుకుంది.

ఈ కార్యక్రమంలో , డైరెక్టర్లు వి. తిరుపతి రెడ్డి, టి. మధుసూదన్, సి. ప్రభాకర్, చీఫ్ ఇంజనీర్లు తిరుమల్ రావు, అశోక్, వెంకటరమణ అన్నపూర్ణ, సీజీఎంలు చరణ్ దాస్, , వేణుబాబు, జిఎం హేమంత్ కుమార్,మహిళా ఉద్యోగులు ప్రభావతి,జమున, గంగాజమున,సునీత, కల్పన, లక్ష్మీ, లావణ్యతో పాటు హనుమకొండ, వరంగల్ సర్కిళ్లకు చెందిన మహిళా ఉద్యోగులు, ఇంజనీరింగ్, అకౌంట్స్, పీ అండ్ జీ విభాగాల సిబ్బంది, ఆర్టిజన్లు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.




## అక్రమ ఇసుక రవాణాను వెంటనే నిలిపివేయాలని ఫిర్యాదు

నాగర్ కర్నూలు జిల్లా, (ఫోటో జర్నలిస్ట్ మల్లేష్ బాబు) తెలకపల్లి మండలంలో ఇసుక మాఫియాను వెంటనే అరికట్టాలని సోమవారం తహసిల్దార్ విజయ్ కుమార్ కు పూలే అంబేద్కర్ యువజన విభాగం రాష్ట్ర సమితి నాయకులు జిలకర బాలస్వామి,ఎమ్మార్పీఎస్ గౌరవ అధ్యక్షులు బండారు లక్ష్మణ్ , పూలే అంబేద్కర్ విభాగం కార్యదర్శి పి జగదీష్,లు ఫిర్యాదు చేశారు దుందుభి వాగు వెంట నడిగడ్డ, రామగిరి, అదేవిధంగా ఉప్పునుంతల మండలంలోని దాసర్లపల్లి తదితరచోట్ల పెద్ద ఎత్తున అక్రమంగా ఇసుక నిలువలను ఏర్పాటు చేసుకొని టిప్పర్లు, ట్రాక్టర్ల, ద్వారా అక్రమంగా వివిధ ప్రాంతాలకు తరలిస్తూ కోట్లల్లో సొమ్ము చేసుకుంటున్నారని నాయకులు ఆరోపించారు ఇసుక మాఫియా దెబ్బకు పలుచోట్ల రోడ్లు ధ్వంసమై వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారని నిరసన వ్యక్తం చేశారు ఇప్పటికైనా అధికారులు స్పందించి ఇసుక మాఫియా ఆగడాలను అరికట్టాలని డిమాండ్ చేస్తూ ఫిర్యాదు చేశారు.

# ప్రజావాణికి ప్రాధాన్యత ఇవ్వాలి

### ప్రజల గోడు విని తక్షణ న్యాయం చేయాలి: మహబూబ్ నగర్ జిల్లా ఎస్పీ డి.జానకి ఐపీఎస్ సంచలన ఆదేశాలు

### ఫిర్యాదుదారులతో మర్యాదగా ఉండాలి.. జాప్యం వద్దు.. నిర్ణీత సమయంలో పరిష్కారం చూపాలి.. పోలీస్ అధికారులకు స్ట్రాంగ్ వార్నింగ్

తెలంగాణ స్టేట్ బ్యూరో, మహబూబ్ నగర్, అక్టోబర్ 12 (విజన్ ఆంధ్ర): మహబూబ్ నగర్ జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమం ప్రజలకు భరోసానిచ్చింది. జిల్లా ఎస్పీ శ్రీమతి డి.జానకి, ఐపీఎస్ స్వయంగా రంగంలోకి దిగి, జిల్లా నలుమూలల నుంచి వచ్చిన బాధితుల ఫిర్యాదులను స్వయంగా స్వీకరించారు.

ఉదయం నుంచే క్యూ కట్టిన ప్రజల దగ్గరకు వెళ్లి, ఒక్కొక్కరి సమస్యను ఓపిగ్గా విన్నారు. వ్యక్తిగత గొడవలు, కుటుంబ కలహాలు, భూ వివాదాలు, ఆర్థిక మోసాలు, ఇతర సమస్యలపై వచ్చిన దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించారు. కేవలం దరఖాస్తు తీసుకోవడమే కాదు, అక్కడికక్కడే సంబంధిత సీఐ, ఎస్ఐ, డీఎస్పీలకు ఫోన్ చేసి, సమస్య వివరాలు చెప్పి, పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలపై స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు.

ఎస్పీ గారి కీలక ఆదేశాలు ఇవే:

ప్రజావాణి అనేది కేవలం లాంఛనం కాదని, ప్రజలకు న్యాయం చేసే వేదికగా మారాలని ఎస్పీ జానకి స్పష్టం చేశారు. ప్రతి ఫిర్యాదును ప్రాధాన్యతగా తీసుకోవాలని, బాధితుల సమస్యలను చట్టపరిధిలో పరిష్కరించేందుకు కృషి చేయాలని ఆదేశించారు. ఫిర్యాదులపై ఎలాంటి జాప్యం లేకుండా తక్షణమే స్పందించాలని, ప్రతి దరఖాస్తుపై సమగ్ర



విచారణ చేపట్టి వాస్తవాలను నిర్ధారించిన తర్వాత చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని సూచించారు.

ప్రజలకు న్యాయం చేయడం, వారి సమస్యలకు పరిష్కారం చూపడం పోలీస్ శాఖ ప్రధాన బాధ్యత అని పేర్కొంటూ, ఫిర్యాదుదారులతో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని, వారి సమస్యలను సానుకూల దృక్పథంతో పరిశీలించి, నిర్ణీత సమయంలో పరిష్కారం లభించేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు స్ట్రాంగ్ వార్నింగ్ ఇచ్చారు.

ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం పోలీస్ శాఖను ఆశ్రయించినప్పుడు వారికి న్యాయం జరిగేలా అధికారులు బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని జిల్లా ఎస్పీ గారు ఆదేశించారు. ఎస్పీ గారి ఈ నిర్ణయంతో బాధితుల్లో హర్షం వ్యక్తమవుతోంది.

## జిల్లా దశాబ్ది ఉత్సవాల సందర్భంగా

# జిల్లా దశాబ్ది ఉత్సవాల సందర్భంగా భూపాలపల్లి అభివృద్ధిని గుర్తుచేసుకుంటూ కేసీఆర్‌కు కృతజ్ఞతలు తెలిపిన గండ్ర..

### - జిల్లా అడ్వకేట్స్ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కెసిఆర్ చిత్ర పటానికి పాలాభిషేకం

భూపాలపల్లి అక్టోబర్ 12 (విజన్ ఆంధ్ర ) జిల్లా ఏర్పడి 10 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న దశాబ్ది ఉత్సవాలల్లో భాగంగా మూడవ రోజు జిల్లా కోర్టు నందు అడ్వకెట్స్ ను మరియు జిల్లా సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ (ఎస్పీ ) అదే విదంగా జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ మరియు జిల్లా అధికారులను, అనంతరం మెడికల్ కాలేజీ నందు మెడికల్ కాలేజీ స్టాఫ్ మరియు విద్యార్థులను మర్యాదపూర్వకంగా కలిసి వారికి పుష్పగుచ్చం అందించి, స్వీట్ తినిపించి శుభాకాంక్షలు తెలిపిన భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకట రమణా రెడ్డి సందర్భంగా జిల్లా అడ్వకెట్స్ బార్ అసోసియేషన్ తరుపున కెసిఆర్ చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించి కేసీఆర్ గారికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే గండ్ర మాట్లాడుతూ..జయశంకర్ భూపాలపల్లి జిల్లా ఏర్పాటై పది సంవత్సరాలు పూర్తిచేసుకుని 11వ సంవత్సరంలోకి అడుగుపెట్టిన సందర్భంగా జిల్లా ఏర్పాటు చేసి, జిల్లా అభివృద్ధికి రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి, తెలంగాణ రాష్ట్ర సాధకుడు కేసీఆర్ చేసిన కృషిని గుర్తుచేసుకుంటూ వారికీ కృతజ్ఞతలు తెలిపారు.భూపాలపల్లి జిల్లా కేంద్రంగా ఏర్పడటం ఈ ప్రాంత చరిత్రలో కీలక మైలురాయి అని



పేర్కొన్నారు. ఒకప్పుడు మారుమూల ప్రాంతంగా ఉన్న భూపాలపల్లిని జిల్లా కేంద్రంగా మార్చడం ద్వారా పరిపాలనా సౌకర్యాలు ప్రజలకు చేరువయ్యాయని తెలిపారు.

జిల్లా ఏర్పాటుతో ఒక్క కలెక్టర్,ఒక్క ఐపీఎస్, జిల్లా జడ్జి,అధికారులు స్థానికంగానే అందుబాటులో ఉండటంతో పాటు, సమీకృత జిల్లా కలెక్టరేట్ సముదాయం నిర్మాణం వల్ల వివిధ ప్రభుత్వ కార్యాలయాల సేవలు ఒకే ప్రాంగణంలో అందుతున్నాయని వివరించారు. గతంలో ఇతర ప్రభుత్వ కార్యాలయాల కోసం సూదూర ప్రాంతాలకు వెళ్లాల్సి వచ్చేదని, ప్రస్తుతం ప్రజలకు పరిపాలనా సేవలు మరింత సులభంగా అందుతున్నాయని పేర్కొన్నారు.భూపాలపల్లిలో మెడికల్ కాలేజీ ఏర్పాటు, ఆసుపత్రి నిర్మాణం, విద్యా సదుపాయాల అభివృద్ధి ఈ ప్రాంతానికి ప్రత్యేక గుర్తింపును తీసుకొచ్చాయన్నారు. జిల్లా కేంద్రం ఏర్పాటుతో స్థానికంగా న్యాయవాదులకు ఉపాధి అవకాశాలు పెరిగాయని, గతంలో కోర్టు పనుల కోసం దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన పరిస్థితులతో పోలిస్తే ప్రస్తుతం ప్రజలకు సౌకర్యాలు మెరుగుపడ్డాయని తెలిపారు.భూపాలపల్లి జిల్లా అభివృద్ధికి పునాది వేసిన కేసీఆర్‌కు కృతజ్ఞతలు తెలియజేయడం మన బాధ్యత అని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రం మరింత అభివృద్ధి చెందాలని, కేసీఆర్ నాయకత్వంలో రాష్ట్రం పురోగతి సాధించాలని ఆకాంక్షించారు. జిల్లా దశాబ్ది ఉత్సవాల సందర్భంగా భూపాలపల్లి ప్రజలందరికీ శుభాకాంక్షలు తెలిపారు.

అదేవిధంగా, ప్రస్తుత ప్రభుత్వం గత మూడేళ్లలో అభివృద్ధి విషయంలో ఆశించిన స్థాయిలో ముందుకు సాగడం లేదని, ప్రచారానికి ప్రాధాన్యత ఇవ్వడం కంటే ప్రజలకు ఉపయోగపడే అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టాలని సూచించారు. మిగిలిన కాలంలోనైనా భూపాలపల్లి జిల్లాలో అభివృద్ధి పనులను వేగవంతం చేసి, ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా మౌలిక సదుపాయాలను మెరుగుపరచాలని కోరారు.అభివృద్ధి అనేది నిరంతర ప్రక్రియగా కొనసాగాలని, భూపాలపల్లి జిల్లా మరింత ప్రగతి సాధించేలా పాలకులు కృషి చేయాలని ఈ సందర్భంగా పేర్కొన్నారు. వారి వెంట జిల్లా బిఆర్ఎస్ పార్టీ ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, యువకులు తదితరులు పాల్గొన్నారు.

## నాగర్ కర్నూలు జిల్లాకు జాతీయస్థాయిలో గుర్తింపు (అవార్డు) రావడం ఎంతో గర్వకారణం



అచ్చంపేట అక్టోబర్ 12 (విజన్ ఆంధ్ర): ప్రధాన మంత్రి ధన్ ధాన్య కృషి యోజన పథకం అమలులో నాగర్ కర్నూలు జిల్లాకు జాతీయస్థాయిలో అవార్డు లభించడం గర్వకారణమని తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (టీయూడబ్ల్యూ హెచ్--143) రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఎల్. చందునాయక్ హర్షం వ్యక్తం చేశారు. ఈ ప్రతిష్ఠాత్మక అవార్డును న్యూఢిల్లీలో కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ చేతుల మీదుగా అందుకున్న జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్‌కు హృదయపూర్వక అభినందనలు తెలిపారు. వ్యవసాయ రంగ అభివృద్ధి, రైతుల సంక్షేమం, వ్యవసాయ ఉత్పాదకత పెంపు లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రధానమంత్రి ధన్ ధాన్య కృషి యోజన పథకంలో జిల్లాకు జాతీయస్థాయి గుర్తింపు లభించడం ఎంతో సంతోషకరమని పేర్కొన్నారు. నాగర్ కర్నూలు జిల్లాకు జాతీయస్థాయిలో గుర్తింపు తీసుకురావడంలో కృషి చేసిన కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్‌కు మరోసారి అభినందనలు తెలియజేస్తూ, భవిష్యత్తులో జిల్లా మరిన్ని విజయాలు సాధించాలని చందునాయక్ ఆకాంక్షించారు.

## అన్నపూర్ణ అలంకారంలో దర్శనమిచ్చిన అమ్మవారు



భీమదేవరపల్లి అక్టోబర్ 12 (విజన్ ఆంధ్ర): హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం కొత్తకొండ శ్రీ వీరభద్ర స్వామి దేవస్థానంలో భద్రకాళి శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా రెండో రోజు అమ్మవారు అన్నపూర్ణ అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా ముందుగా గణపతి పూజ, శైవశుద్ధి పుణ్యాహవచనం, సర్వతోభద్ర మండల ఆవాహన, చతుఃషష్టి ఉపచార పూజలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. రెండో రోజు ఉత్సవాల్లో భాగంగా అమ్మవారిని బ్రహ్మచారిణి స్వరూపంలోనూ భక్తులు దర్శించుకున్నారు. పూజా కార్యక్రమాల అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో భక్తులు, అర్చకులు, దేవస్థాన సిబ్బంది పాల్గొన్నారు.

# సింగరేణి కార్మికుల లాభాల వాటా వెంటనే చెల్లించాలి

### కార్మిక సంఘాలు జవాబుదారీగా వ్యవహరించాలి: విప్లవ కార్మిక సంఘాల డిమాండ్...




బెల్లంపల్లి, అక్టోబరు 12 విజన్ ఆంధ్ర : సింగరేణి కార్మికులకు రావాల్సిన లాభాల వాటాను వెంటనే చెల్లించాలని విప్లవ కార్మిక సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. లాభాల వాటా చెల్లింపులో జాప్యానికి కారణాలను ప్రభుత్వం, యాజమాన్యం వెల్లడించాలని కోరారు. కార్మికుల సమస్యల పరిష్కారంలో గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాలు తమ వైఖరిని స్పష్టం చేయాలని అన్నారు.

కార్మిక సంఘాల నాయకులు ముఖ్యమంత్రితో చర్చలు జరిపి పెండింగ్ సమస్యల పరిష్కారానికి కార్యాచరణ ప్రకటించాలని సూచించారు. కార్మిక సంఘాలకు చందాల రూపంలో జరుగుతున్న వేతన కోతలపై నిబంధనల ప్రకారం సమీక్ష నిర్వహించి పారదర్శకత పాటించాలని కోరారు. గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాల కాలపరిమితి ముగిసినందున కార్మికుల నుంచి చందాల వసూలు నిలిపివేయాలని డిమాండ్ చేశారు.

సింగరేణిలో కొత్త బొగ్గు గనుల పరిస్థితిపై ప్రభుత్వం, యాజమాన్యం స్పష్టత ఇవ్వాలని కోరారు. కార్మికుల హక్కుల సాధనకు సంఘాలు జవాబుదారీగా వ్యవహరించాలని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో సింగరేణి కాలరీస్ లేబర్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి టి. మణిరామ్ సింగ్, సింగరేణి గని కార్మిక సంఘం (ఎస్‌జీకేఎస్) రాష్ట్ర నాయకుడు అంబాల మహేందర్, శ్రామిక శక్తి గోదావరి కార్మిక సంఘం (ఏఐఎఫ్‌టీయూ) రాష్ట్ర కార్యదర్శి ఎం. పోచమల్లు, కాంట్రాక్ట్ వర్కర్స్ బెల్లంపల్లి జిల్లా నాయకుడు గజ్జె దుర్గయ్య తదితరులు పాల్గొన్నారు.

# హుస్నాబాద్ ఆల్ఫోర్స్ హై స్కూల్లో ఘనంగా బతుకమ్మ వేడుకలు

### - దుర్గామాతకు ప్రత్యేక పూజలు నిర్వహించిన ఆల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ వి.నరేందర్ రెడ్డి



హుస్నాబాద్ విజన్ ఆంధ్ర అక్టోబర్ 12 : సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ పట్టణంలోని అల్ఫోర్స్ విద్యాసంస్థల్లో ఘనంగా బతుకమ్మ వేడుకలు నిర్వహించారు. తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీక బతుకమ్మ అని అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ వి.నరేందర్ రెడ్డి స్థానిక హనుమాన్ నగర్ లోని అల్ఫోర్స్ హై స్కూల్ లో నిర్వహించినటువంటి బతుకమ్మ ఉత్సవాలకు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రారంభానికి ముందు వారు మైదానంలో జ్యోతి ప్రజ్వలన చేసి, దుర్గామాత కు ప్రత్యేక పూజలు నిర్వహించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అల్ఫోర్స్ విద్యాసంస్థల వారి ఆధ్వర్యంలో ప్రతి సంవత్సరం బతుకమ్మ ఉత్సవాలను ఎంతో వైభవంగా మరియు ఉత్సాహంగా నిర్వహించడం ఆనవాయితీగా వస్తోందన్నారు. ఈ సంప్రదాయాన్ని కొనసాగిస్తూ ఈ ఏడాది కూడా బతుకమ్మ వేడుకలను ఎంతో భక్తిశ్రద్ధలతో, ఆనందోత్సాహాల మధ్య నిర్వహించడం జరిగిందన్నారు. తొమ్మిది రోజుల బతుకమ్మ ఉత్సవాల్లో చివరి రోజైన సద్దుల బతుకమ్మ వేడుకలకు ప్రత్యేక ప్రాధాన్యత ఉన్నదని చెప్పారు. తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా ప్రజలందరూ ఎంతో ఆనందంగా జరుపుకునే బతుకమ్మ పండుగ మన సంస్కృతి వైభవానికి ప్రతిబింబమని, తరతరాలుగా వస్తున్న ఈ అద్భుతమైన సంప్రదాయాన్ని కాపాడుకుంటూ భావితరాలకు అందించడం ప్రతి ఒక్కరి బాధ్యతని చెప్పారు. ఉత్సవాలలో భాగంగా విద్యార్థినిలు అందంగా అలంకరించిన బతుకమ్మలను తీసుకువచ్చి కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. ఆకర్షణీయమైనా బతుకమ్మలను తీసుకువచ్చి పండుగ వాతావరణాన్ని రెట్టింపు చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ దండి లక్ష్మీ,వైస్ చైర్మన్ చిత్తారి పద్మ,కౌన్సిలర్లు బొలిశెట్టి రాజు పిల్లి తిరుపతి, సావుల మంజుల,కొండ రజిత, బత్తుల స్వరూప,సర్పంచ్ కృష్ణా నాయక్, ఎస్సెల్ జిల్లా అధ్యక్షుడు మోతిలాల్ నాయక్, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ భూమి వివాదం.. నిర్మాణ అనుమతులపై విచారణకు ఆదేశాలు!

- ప్రజావాణిలో ఫిర్యాదుపై స్పందించిన జోనల్ కమిషనర్
- టౌన్ ప్లానింగ్ ఏసీపీ సుమిత్రాకు మౌఖిక సూచనలు
- సర్వే వివరాలు, అనుమతుల రికార్డుల పరిశీలనకు ఆదేశం
- తదుపరి చర్యలపై స్థానికంగా ఉత్కంఠ



కుత్బుల్లాపూర్, అక్టోబర్ 12 (విజన్ ఆంధ్ర): ప్రభుత్వ భూమికి సంబంధించిన వివాదంపై అందిన ఫిర్యాదుపై కుత్బుల్లాపూర్ జోనల్ కమిషనర్ స్పందించారు. సోమవారం జోనల్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో ఈ అంశాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో, వివాదాస్పద స్థలానికి సంబంధించిన భవన నిర్మాణ అనుమతులపై సమగ్రంగా పరిశీలన జరపాలని టౌన్ ప్లానింగ్ ఏసీపీ సుమిత్రాకు జోనల్ కమిషనర్ మౌఖికంగా సూచించినట్లు సమాచారం.

**రికార్డుల పరిశీలనపై దృష్టి**

ప్రభుత్వ భూమికి సంబంధించి ఫిర్యాదులు అందిన నేపథ్యంలో స్థలానికి సంబంధించిన సర్వే వివరాలు, భూమి హద్దులు, యాజమాన్య రికార్డులు, భవన నిర్మాణ అనుమతుల జారీ ప్రక్రియను క్షుణ్ణంగా పరిశీలించాల్సి ఉంది. సంబంధిత స్థలం ప్రభుత్వ భూమి పరిధిలోకి వస్తుందా? నిర్మాణ అనుమతులు నిబంధనలకు అనుగుణంగా జారీ చేశారా? అనే అంశాలపై అధికారుల విచారణతో స్పష్టత వచ్చే అవకాశం ఉంది.

**అనుమతుల రద్దుపై స్పష్టత రావాల్సి ఉంది**

జోనల్ కమిషనర్ మౌఖిక సూచనల మేరకు టౌన్ ప్లానింగ్ విభాగం చేపట్టే రికార్డుల పరిశీలన, క్షేత్రస్థాయి తనిఖీలు కీలకంగా మారాయి. విచారణలో నిబంధనల ఉల్లంఘనలు నిర్ధారణ అయితే నిబంధనల ప్రకారం తదుపరి చర్యలు తీసుకునే అవకాశం ఉంది. అయితే, భవన నిర్మాణ అనుమతుల రద్దుకు సంబంధించి అధికారిక ఉత్తర్వులు జారీ అయ్యాయా? లేదా? అనే విషయంపై స్పష్టత రావాల్సి ఉంది.

**తదుపరి చర్యలపై ఆసక్తి**

ప్రభుత్వ భూముల పరిరక్షణ, అక్రమ నిర్మాణాల నియంత్రణ విషయంలో అధికార యంత్రాంగం తీసుకునే చర్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. ప్రజావాణిలో అందిన ఫిర్యాదుపై ఉన్నతాధికారి స్పందించడంతో, సంబంధిత అధికారులు చేపట్టే విచారణపై స్థానికంగా ఆసక్తి నెలకొంది. రికార్డుల పరిశీలనలో ఎలాంటి అంశాలు వెలుగులోకి వస్తాయి? నిబంధనల ఉల్లంఘనలు తేలితే ఎలాంటి చర్యలు తీసుకుంటారు? అన్నది వేచి చూడాలి.

# రైతులకు నాణ్యమైన విద్యుత్ అందించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం



## ప్రజా పాలన పేరుతో రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం

## హుస్నాబాద్ మాజీ ఎమ్మెల్యే వొడితల సతీష్ కుమార్

హుస్నాబాద్ విజన్ ఆంధ్ర అక్టోబర్ 12 : సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ నియోజకవర్గ కేంద్రంలోని కరీంనగర్ రోడ్డులో ఉన్న డీఈ కార్యాలయం, సబ్‌స్టేషన్ ఎదుట బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ధర్నా, రాస్తారోకో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హుస్నాబాద్ మాజీ శాసనసభ్యులు వొడితల సతీష్ కుమార్ పాల్గొని రైతులకు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రైతుల సంక్షేమానికి పెద్దపీట వేస్తూ వ్యవసాయానికి నాణ్యమైన విద్యుత్ అందించామని తెలిపారు. రైతులకు ఉచిత విద్యుత్, సాగునీరు, రైతుబంధు వంటి పథకాలతో వ్యవసాయ రంగాన్ని బలోపేతం చేసేందుకు బీఆర్ఎస్ ప్రభుత్వం కృషి చేసిందని గుర్తుచేశారు. ఎన్నికల సమయంలో అనేక హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం, వాటి అమలులో నిర్లక్ష్యం వహిస్తూ రైతులను ఇబ్బందులకు గురిచేస్తోందని విమర్శించారు. ప్రజా పాలన పేరుతో గొప్పలు చెప్పుకోవడం కాదు.. రైతులకు అవసరమైన విద్యుత్‌ను సక్రమంగా అందించి వారి సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. వ్యవసాయానికి నిరంతరాయంగా నాణ్యమైన విద్యుత్ అందించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని, విద్యుత్ సరఫరాలో అంతరాయాల వల్ల రైతులు ఇబ్బందులు పడకుండా ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు. రైతులకోసం పార్టీ నిరంతరం పోరాటం చేస్తుందని, రైతులకు న్యాయం జరిగే వరకు వెనుకడుగు వేసే ప్రసక్తే లేదని వొడితల సతీష్ కుమార్ స్పష్టం చేశారు. ఈ ధర్నా, రాస్తారోకో కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు బిఆర్ఎస్ పట్టణ అధ్యక్షులు పేరుక భాగ్యరెడ్డి, మాజీ పట్టణ ఎండి అన్వర్, కన్నోజు రామకృష్ణ, ఏఎంసీ మాజీ చైర్మన్ ఎడబోయిన తిరుపతిరెడ్డి, మాజీ జెడ్పిటిసి భూక్యమంగ, కౌన్సిలర్లు గాదెపాక రవీందర్ బొల్లి శ్రీనివాస్ బాల సుప్రజానవీన్, నాయకులు అయిలేని మల్లికార్జున్ రెడ్డి, అయిలేని శంకర్ రెడ్డి, చిత్తారి శ్రీనివాస్, కూతాటి విజయభాస్కర్, పాక శ్యాంసుందర్, గడ్డం సదానందం, అలుమల్ల ప్రభాకర్ రెడ్డి, భూక్య రాజు, బద్దిపడగ రాజిరెడ్డి, కందుకూరి సతీష్ కుమార్, బండి పుష్ప, కార్యకర్తలు, రైతులు పాల్గొని విద్యుత్ సమస్యలపై నిరసన వ్యక్తం చేశారు.

# ప్రజల సమస్యలకు తక్షణ పరిష్కారమే లక్ష్యం

## – ప్రజాదివాస్‌లో జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్, ఐపీఎస్.

భూపాలపల్లి అక్టోబర్ 12 ( విజన్ ఆంధ్ర ) జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజాదివాన్ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్, ఐపీఎస్ గారు ప్రజల నుంచి నేరుగా ఫిర్యాదులను స్వీకరించి, వాటి పరిష్కారానికి తక్షణ చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

ఈ కార్యక్రమంలో జిల్లా వ్యాప్తంగా వచ్చిన ఫిర్యాదుదారుల నుంచి మొత్తం 12 ఫిర్యాదులు స్వీకరించారు. ప్రతి ఫిర్యాదును ఎస్పీ శ్రద్ధగా విని, సంబంధిత పోలీస్ స్టేషన్ సీఐలు, ఎస్ఐలతో నేరుగా మాట్లాడి, సమస్యల పరిష్కారానికి అవసరమైన సూచనలు, ఆదేశాలు జారీ చేశారు.

ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ గారు మాట్లాడుతూ, ప్రజలు ఎలాంటి పైరవీలు లేదా మూడో వ్యక్తి ప్రమేయం లేకుండా నిర్భయంగా పోలీస్ సేవలను వినియోగించుకోవాలని సూచించారు. చట్టబద్ధమైన విధానంలో ప్రతి ఒక్కరికీ న్యాయం జరిగేలా పోలీస్ శాఖ కట్టుబడి ఉందని, ప్రజలకు మరింత చేరువగా ఉండి శాంతి భద్రతలను పరిరక్షించడం పోలీసుల ప్రధాన బాధ్యత అని తెలిపారు.

నిర్వహిస్తున్న ప్రజాదివాస్ కార్యక్రమం ద్వారా ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని, సంబంధిత అధికారుల సమన్వయంతో త్వరితగతిన పరిష్కరిస్తున్నామని పేర్కొన్నారు. ప్రజలకు సత్వర, పారదర్శకమైన సేవలు అందించేందుకు భూపాలపల్లి జిల్లా పోలీస్ శాఖ ఎల్లప్పుడూ కృషి చేస్తుందని జిల్లా ఎస్పీ తెలిపారు.



# ప్రజావాణి దరఖాస్తుల పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకోవాలి..

## – ఎంపీడీఓ మహబూబ్ అలీ

లికునూరుపల్లి, అక్టోబర్ 12,విజన్ ఆంధ్ర : మండల కేంద్రంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి వివిధ సమస్యలపై ప్రజల నుంచి ఆరు దరఖాస్తులు అందినట్లు ఎంపీడీఓ మహబూబ్ అలీ తెలిపారు. వచ్చిన దరఖాస్తుల్లో విద్యుత్ శాఖకు సంబంధించి రెండు, రెవెన్యూ రెండు, పంచాయతీ రాజ్ ఒకటి, హౌసింగ్ శాఖకు ఒకటి చొప్పున ఉన్నట్లు వెల్లడించారు. ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం అందించిన దరఖాస్తులను సంబంధిత అధికారులు పరిశీలించి, సమస్యల పరిష్కారానికి వెంటనే చర్యలు తీసుకోవాలని ఎంపీడీఓ మహబూబ్ అలీ సూచించారు. అదేవిధంగా గత వారం విజన్ ఆంధ్రలో ప్రచురితం అయిన బ్యానర్ అంశానికి స్పందించిన ఎంపీడీఓ సోమవారం ప్రజావాణిలో నూతన బ్యానర్ ను ఏర్పాటు చేసి, కార్యక్రమం ప్రారంభించారు.

# సేంద్రియ సాగుకు ప్రాధాన్యం ఇవ్వాలి

గాదిగూడ, అక్టోబర్(విజన్ ఆంధ్ర )సేంద్రియ సాగుకు ప్రాధాన్యం పెరిగినా.. సాగులో వినియోగించే ఎరువులు, కషాయాల తయారీ రైతులకు కష్టతరంగా మారిందని సర్పంచ్ కోరేంగా శ్రీదేవి శంభు అన్నారు. సోమవారం గాదిగూడ మండల కేంద్రంలోని ఆద్మీయాన్ గ్రామపంచాయతీలో సీపీఎఫ్ సంస్థ అధ్వర్యంలో రైతులకు అగ్ని అస్త్రం కాషాయలపై అవగాహనా కల్పించారు. ఈ సందర్భంగా కమ్యూనిటీ కోఆర్డినెట్ జగ్గెరావ్ మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయ విభాగం రైతులకు సేంద్రియ సాగు.. కషాయాల తయారీ పట్ల అవగాహన కలిగి ఉండాలని .స్వయంగా సేంద్రియ వ్యవసాయం చేస్తూ.. తయారీ పట్ల రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో చిత్రం జంభోరావ్, ఫీల్డ్ పేసిలిటిటర్ గంగారాం, రైతులు పాల్గొన్నారు.




# సింగరేణి కార్మికులకు న్యాయం చేయాలి: ఏఐటీయూసీ



బెల్లంపల్లి అక్టోబర్ 12 విజన్ ఆంధ్ర : సింగరేణి కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఏఐటీయూసీ కేంద్ర ఉపాధ్యక్షుడు మిట్టపల్లి వెంకటస్వామి డిమాండ్ చేశారు. సోమవారం బెల్లంపల్లి శాంతిఖని గని వద్ద నిర్వహించిన గేట్ మీటింగ్‌లో ఆయన మాట్లాడుతూ పలు డిమాండ్లను ప్రభుత్వం, యాజమాన్యం ముందు ఉంచారు.

సింగరేణిపై రాజకీయ జోక్యాన్ని నిలిపివేయాలని, విద్యుత్ సంస్థల నుంచి రావాల్సిన రూ. 59 వేల కోట్ల బకాయిలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్మికులకు విజయదశమి సందర్భంగా 40 శాతం లాభాల వాటాను ప్రకటించి తక్షణమే చెల్లించాలని కోరారు.

మెడికల్ బోర్డులో ప్రపంచ ఆరోగ్య సూత్రాలు, సింగరేణి వైద్య మార్గదర్శకాలను పాటించాలని, వైద్య పరీక్షల్లో కార్మికుల ఆరోగ్య పరిస్థితులను పరిగణనలోకి తీసుకుని మానవీయంగా వ్యవహరించాలని అన్నారు. కార్మిక చట్టాలను అమలు చేయడంతో పాటు అవసరమైన మెటీరియల్ సరఫరా చేయాలని, కార్మికుల హక్కులను పరిరక్షించాలని డిమాండ్ చేశారు.

ఈ డిమాండ్ల సాధన కోసం అక్టోబర్ 13న హైదరాబాద్‌లో విద్యుత్ సంస్థల ఎదుట నిర్వహించే మహాధర్నాను విజయవంతం చేయాలని కార్మికులకు పిలుపునిచ్చారు.

ఈ సమావేశానికి ఏఐటీయూసీ ఫిట్ కార్యదర్శి రత్నం ప్రవీణ్ అధ్యక్షత వహించగా, బ్రాంచ్ కార్యదర్శి మంతెన రమేష్, రత్నం ఐలయ్య, దాడి రమేష్, రామకృష్ణ, అంజత్ ఖాన్, రాజేశం తదితరులు పాల్గొన్నారు.




# గోదావరిఖని సభకు భారీగా తరలిరావాలి:

## -మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య

బెల్లంపల్లి, అక్టోబర్ 12 విజన్ ఆంధ్ర : ఈ నెల 14న బుధవారం గోదావరిఖనిలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పాల్గొననున్న 'చలో గోదావరిఖని--సింగరేణి కార్మిక గర్జన' బహిరంగ సభకు బి ఆర్, ఎస్ పార్టీ శ్రేణులు నియోజకవర్గం నుంచి భారీ సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య పిలుపునిచ్చారు.

ఈ మేరకు బెల్లంపల్లి మున్సిపాలిటీ, బెల్లంపల్లి మండలానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ ప్రస్తుత, మాజీ ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం (టీబీజీకేఎస్) ముఖ్య నాయకులతో ఆయన సన్నాహక సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా గోదావరిఖనిలో నిర్వహించనున్న బహిరంగ సభకు సంబంధించిన ఏర్పాట్లు, పార్టీ శ్రేణుల భాగస్వామ్యంపై చర్చించారు.

సింగరేణి కార్మికుల సమస్యలు, హక్కులకు సంబంధించిన అంశాలపై నిర్వహించనున్న ఈ సభకు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, కార్మిక సంఘాల ప్రతినిధులు అధిక సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని దుర్గం చిన్నయ్య సూచించారు. సభకు వెళ్లేందుకు పార్టీ శ్రేణులు సమన్వయంతో ఏర్పాట్లు చేసుకోవాలని కోరారు.

# యాదవ సంఘం కమ్యూనిటీ హాల్ కోసం భూమి కేటాయించాలి

## - కొండపాక శ్రీకృష్ణ యాదవ సంఘం సభ్యులు



గజ్వేల్ నియోజకవర్గం, 12 అక్టోబర్ 2026 (విజన్ ఆంధ్ర) : సిద్దిపేట జిల్లా, గజ్వేల్ నియోజకవర్గం కొండపాక మండల కేంద్రంలో శ్రీకృష్ణ యాదవ సంఘం కమ్యూనిటీ హాల్ నిర్మాణం నిమిత్తం ప్రభుత్వ భూమిని కేటాయించాలని కోరుతూ సోమవారం రోజున కొండపాక మండల తాసిల్దార్ కార్యాలయంలో తాసిల్దార్‌కు శ్రీకృష్ణ యాదవ సంఘం కొండపాక సభ్యులు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా యాదవ సంఘం ప్రతినిధులు మాట్లాడుతూ కొండపాక మండల కేంద్రంలోని సర్వే నంబర్లు 731, 733 లో గల 2 ఎకరాల 18 గుంటల ప్రభుత్వ భూమిని శ్రీకృష్ణ యాదవ సంఘం కమ్యూనిటీ హాల్ నిర్మాణం కోసం కేటాయించాలని కోరారు. మండలంలో యాదవ సంఘం సభ్యుల సంఖ్య ఎక్కువగా ఉందని, కమ్యూనిటీ హాల్ నిర్మాణం జరిగితే సంఘ కార్యకలాపాలు, సామాజిక, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించుకోవడానికి ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. ఈ విషయమై సంబంధిత నివేదికలను సిద్ధం చేసి, ప్రభుత్వం మరియు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి త్వరితగతిన భూమి కేటాయింపు ప్రక్రియ పూర్తయ్యేలా చూడాలని తాసిల్దారును విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో శ్రీకృష్ణ యాదవ సంఘం కొండపాక ప్రతినిధులు, సభ్యులు మరియు స్థానిక యాదవ ప్రముఖులు తదితరులు పాల్గొన్నారు.

# వృద్ధాశ్రమంలో అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహణ



ఆదిలాబాద్ రూరల్, సెప్టెంబర్ 12: ఆదిలాబాద్‌లోని కేఆర్‌కే కాలనీలో ఉన్న వృద్ధాశ్రమంలో ఆ×ఆ సంస్థ ఆధ్వర్యంలో అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆ×ఆ సంస్థ డైరెక్టర్ సురేందర్ ఆధ్వర్యంలో, వయోవృద్ధుల జిల్లా సమాఖ్య సహకారంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.

వృద్ధాశ్రమంలో నివసిస్తున్న వృద్ధ మహిళలు, పురుషులకు ఆనందం, ఉత్సాహాన్ని అందించాలనే ఉద్దేశంతో పలు వినోద కార్యక్రమాలను ఏర్పాటు చేశారు. ఇందులో భాగంగా వివిధ ఆటలు, సంగీత కార్యక్రమాలు, పాటలతో వృద్ధులను అలరించారు. వృద్ధులు ఉత్సాహంగా పాల్గొని సంతోషంగా గడిపారు.

అనంతరం వృద్ధాశ్రమంలోని వారితో కలిసి నిర్వాహకులు సహపంక్తి భోజనం చేశారు. వృద్ధులతో ఆప్యాయంగా గడిపి, వారిలో ఆనందాన్ని నింపడం సంతోషంగా ఉందని నిర్వాహకులు పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో ఆ×ఆ సంస్థ డైరెక్టర్ సురేందర్, జిల్లా సమాఖ్య జాయింట్ సెక్రటరీ కమ్మల నరసింహులు, శ్యామ్ రాజ్ గౌడ్, న్యాయ సలహాదారు బి. విశ్వంభర్, సభ్యులు పూర్ణచందర్ రావు, సుదర్శన్ రెడ్డి, దేవా సింగ్, అప్సర్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వృద్ధాశ్రమ నిర్వాహకులు, వయోవృద్ధుల జిల్లా సమాఖ్య అధ్యక్షుడు, ఆ×ఆ సంస్థ అధ్యక్షుడు డాక్టర్ దేవిదాస్ దేశ్‌పాండేకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

# సాయి లక్ష్మి లేఔట్ పార్కు స్థలంపై వివాదం!

- ప్రజా పార్కును పరిరక్షించాలి.. అక్రమాలపై సమగ్ర విచారణ జరపాలి
- నిజాంపేట్ డిప్యూటీ కమిషనర్, కుత్బుల్లాపూర్ జోనల్ కమిషనర్‌కు జేఏసీ ఫిర్యాదు
- 1,802.90 చదరపు మీటర్ల స్థలంపై లేఔట్ రికార్డుల్లో భిన్నమైన వివరాలు?
-చర్యలు తీసుకోకుంటే దసరా తర్వాత భారీ ప్రజా నిరసనకు జేఏసీ హెచ్చరిక

కుత్బుల్లాపూర్, అక్టోబర్ 12 (విజన్ ఆంధ్ర): ప్రజా అవసరాల కోసం కేటాయించిన పార్కు స్థలాన్ని పరిరక్షించాల్సిన అధికారులు.. ఆ స్థలంపై నెలకొన్న వివాదానికి తెరదించి, వాస్తవాలను నిగ్గు తేల్చాలని సాయి లక్ష్మి లేఔట్ జాయింట్ యాక్షన్ కమిటీ (జేఏసీ) డిమాండ్ చేసింది. ప్రగతినగర్‌లోని సాయి లక్ష్మి లేఔట్‌లో సుమారు 1,802.90 చదరపు మీటర్ల స్థలాన్ని పార్కు లేదా బహిరంగ ప్రదేశంగా పరిరక్షించాలని కోరుతూ జేఏసీ నాయకులు నిజాంపేట్ డిప్యూటీ కమిషనర్ కార్యాలయం వద్ద నిరసన చేపట్టి వినతిపత్రం సమర్పించారు. అనంతరం కుత్బుల్లాపూర్ జోనల్ కమిషనర్ కార్యాలయంలోనూ ఫిర్యాదు చేసి, స్థలాన్ని కాపాడేందుకు తక్షణ చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.



### పార్కు స్థలంపై రికార్డుల్లో కీలక అంశాలు

లేఔట్ రికార్డుల ప్రకారం వివాదాస్పద స్థలం ప్రజల అవసరాల కోసం పార్కు లేదా బహిరంగ ప్రదేశంగా కేటాయించినట్లు జేఏసీ పేర్కొంది. గతంలో నిజాంపేట్ మున్సిపల్ కమిషనర్ జారీ చేసిన లేఖ నంబర్ +1/825/ా/ాదీజ/2021, తేదీ 09-03-2021లోనూ సంబంధిత స్థలం లేఔట్‌లో పార్కుగా చూపబడినట్లు, అది మున్సిపల్ సంస్థ ఆధీనంలో ఉన్నట్లు రికార్డులు సూచిస్తున్నాయని తెలిపింది. అలాగే, ఈ అంశంపై విచారణ జరిపి నివేదిక సమర్పించాలని హెచ్ఎండీఏ లేఖ నంబర్ 40178/బీజుణ/=1/ఖ6/ాబీణూ/2020, తేదీ 06-04-2021 ద్వారా కోరినట్లు వివరించింది.

రెండు లేఔట్లు.. ఏది అసలు రికార్డు?

ఒకవైపు పార్కు లేదా బహిరంగ ప్రదేశంగా స్థలాన్ని చూపించే లేఔట్ ఉండగా, మరోవైపు అదే స్థలాన్ని భిన్నంగా చూపించే లేఔట్ కూడా అందుబాటులో ఉన్నట్లు సమాచారం. దీంతో అసలు లేఔట్ ఏది? స్థలానికి సంబంధించిన హక్కులు ఎవరికి ఉన్నాయి? అక్కడ చేపడుతున్న పనులకు అనుమతులు ఎలా జారీ అయ్యాయి? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఈ నేపథ్యంలో అసలు లేఔట్ ప్రతులు, రెవెన్యూ రికార్డులు, మున్సిపల్ దస్త్రాలు, హెచ్ఎండీఏ అనుమతి ఫైలు, స్థల పరిశీలన నివేదికలు, సంబంధిత కోర్టు లేదా అధికారిక ఉత్తర్వులను క్షుణ్ణంగా పరిశీలించి వాస్తవాలను వెల్లడించాలని జేఏసీ కోరింది.

### పనులు నిలిపివేసి.. విచారణ చేపట్టాలి

ప్రస్తుతం వివాదాస్పద స్థలంలో జేసీబీలతో తవ్వకాలు, ఇతర నిర్మాణ పనులు జరుగుతున్నట్లు సమాచారం ఉందని జేఏసీ ఆందోళన వ్యక్తం చేసింది. విచారణ పూర్తయ్యే వరకు స్థల స్వరూపాన్ని మార్చే పనులను నిలిపివేసి, పార్కు స్థలం పరిరక్షణకు అవసరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేసింది. అధికారులు స్పందించకపోతే దసరా పండుగ అనంతరం ప్రజలను సమీకరించి మున్సిపల్ కార్యాలయం ఎదుట భారీ నిరసన కార్యక్రమం చేపడతామని హెచ్చరించింది. ఈ కార్యక్రమంలో ఆకుల సతీష్, అమలేశ్వరి, భిక్షపతి, రవి నాయక్, గోపాల్ నాయక్, మాధవరావు, హనుమయ్య, అంకం సతీష్, కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# దుండిగల్‌లో రోడ్డు అభివృద్ధికి రూ.46 లక్షలు!

**-కేవీఆర్ వ్యాలీ మెయిన్ రోడ్డులో సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన**

**- స్థానికుల సమస్యపై స్పందించిన కొలన్ హన్మంత్ రెడ్డి**

**- మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యమిస్తామని వెల్లడి**

కుత్బుల్లాపూర్, అక్టోబర్ 12 (విజన్ ఆంధ్ర): దుండిగల్ డివిజన్‌లో రోడ్డు సమస్యకు పరిష్కారం దిశగా అడుగులు పడ్డాయి. కేవీఆర్ వ్యాలీ మెయిన్ రోడ్డులో సీసీ రోడ్డు నిర్మాణ పనుల కోసం సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (సీఎంసీ) నిధుల నుంచి రూ.46 లక్షలు మంజూరయ్యాయి. ఈ నిధులతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు



కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి కొలన్ హన్మంత్ రెడ్డి శంకుస్థాపన చేశారు. కేవీఆర్ వ్యాలీ మెయిన్ రోడ్డులో నెలకొన్న సమస్యలను స్థానికులు కొలన్ హన్మంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై స్పందించిన ఆయన ప్రత్యేక చొరవ తీసుకుని సీసీ రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరయ్యేలా కృషి చేశారు. ఈ నేపథ్యంలో సంగొల్ల మహేందర్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని పనులకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా కొలన్ హన్మంత్ రెడ్డి మాట్లాడుతూ.. ప్రజలకు మెరుగైన రోడ్డు సదుపాయాలు కల్పించడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని తెలిపారు. దుండిగల్ డివిజన్‌లో మౌలిక వసతులను మెరుగుపరుస్తూ, స్థానికుల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి పనులకు ప్రాధాన్యమిస్తామని పేర్కొన్నారు. నియోజకవర్గ సమగ్ర అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు అమరం ముత్యం రెడ్డి, డివిజన్ అధ్యక్షుడు జక్కుల మల్లేష్ యాదవ్, కొలన్ జీవన్ రెడ్డి, మాజీ సర్పంచ్ కావలి గణేష్, నిజాంపేట్ సర్కిల్ డివిజన్ అధ్యక్షుడు కొలన్ రాజశేఖర్ రెడ్డి, నియోజకవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షుడు బోట్ల విజయ్ కుమార్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు పిసరి మహేందర్ రెడ్డి, మనోజ్, సురేష్, లక్ష్మారెడ్డి, గురువారెడ్డి, మనోహర్, గోపాల్, పద్మారావు, ఆకుల ప్రేమ్ కుమార్, మల్లంపేట్ ప్రకాష్, రాకేష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ప్రజావాణి కార్యక్రమం

– ప్రజల నుంచి స్వీకరించిన అర్జీలను క్షుణ్ణంగా పరిశీలించి, పరిష్కరించేలా సంబంధిత శాఖల అధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ ఆదేశించారు.

భూపాలపల్లి అక్టోబర్ 12 (విజన్ ఆంధ్ర ) కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ప్రజల నుంచి వివిధ సమస్యలకు సంబంధించిన వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా మొత్తం 67 దరఖాస్తులు అందినట్లు తెలిపారు. ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం ఎంతో ఆశతో ప్రజావాణిని ఆశ్రయిస్తున్నందున, వారి అర్జీల పట్ల అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు.

ప్రజావాణిలో స్వీకరించిన ప్రతి అర్జీని వెంటనే సంబంధిత శాఖల అధికారులకు ఎండార్స్‌మెంట్ చేశామని సాధ్యమైనంత త్వరగా పరిష్కరించాలని ఆదేశించారు. ముఖ్యంగా, అర్జీల పరిష్కారంలో ఎలాంటి జాప్యం లేకుండా వారంలోగా చర్యలు పూర్తి చేయాలని స్పష్టం చేశారు. అర్జీలపై తీసుకున్న చర్యలు, పరిష్కార పురోగతికి సంబంధించిన వివరాలను తప్పనిసరిగా సంబంధిత పోర్టల్‌లో ఎప్పటికప్పుడు నమోదు చేయాలని సూచించారు. ప్రజావాణికి వచ్చే ప్రతి అర్జీకి అత్యంత ప్రాధాన్యతనివ్వాలని, అర్జీల పరిష్కారంలో జాప్యం చేస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు అశోక్‌కుమార్, విజయలక్ష్మి, ఆర్డీఓ హరికృష్ణతో పాటు వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# జీడిమెట్లలో తాగునీటి సరఫరాకు కొత్త పైప్‌లైన్!

**-ఎం.ఎన్.రెడ్డి నగర్ ఫేజ్-1లో రూ.6.70 లక్షలతో పనులకు శంకుస్థాపన**

**- కాలనీల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యం: ఎమ్మెల్యే కేపీ వివేకానంద్**

**- జీడిమెట్ల డివిజన్ అభివృద్ధికి మరిన్ని నిధులు వెచ్చిస్తామని వెల్లడి**



కుత్బుల్లాపూర్, అక్టోబర్ 12 (విజన్ ఆంధ్ర): కాలనీల్లో మౌలిక వసతుల కల్పనతోనే ప్రజలకు మెరుగైన సౌకర్యాలు అందుతాయని బీఆర్ఎస్ ఎల్పీ విప్, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ అన్నారు. జీడిమెట్ల డివిజన్ పరిధిలోని 132వ డివిజన్ ఎం.ఎన్.రెడ్డి నగర్ ఫేజ్–1లో రూ.6.70 లక్షల అంచనా వ్యయంతో నూతనంగా చేపట్టనున్న తాగునీటి సరఫరా పైప్‌లైన్ పనులకు సోమవారం ఆయన ముఖ్యఅతిథిగా హాజరై శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. జీడిమెట్ల డివిజన్‌లోని అన్ని బస్తీలు, కాలనీల్లో మౌలిక వసతుల అభివృద్ధికి గత పన్నెండేళ్లలో కోట్లాది రూపాయల నిధులు వెచ్చించినట్లు తెలిపారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామని పేర్కొన్నారు. రానున్న రోజుల్లోనూ కాలనీల్లో మౌలిక వసతులను మరింత మెరుగుపరిచేందుకు కృషి చేస్తామని వెల్లడించారు. తాగునీటి సరఫరా వ్యవస్థను మెరుగుపరిచే ఈ పైప్‌లైన్ పనులతో స్థానికులకు ప్రయోజనం చేకూరనుంది. ఈ కార్యక్రమంలో వాటర్ వర్క్స్ మేనేజర్ శివప్రసాద్, కాలనీ అధ్యక్షుడు సంపత్ గౌడ్, ప్రధాన కార్యదర్శి రవీందర్ గౌడ్, సంయుక్త సహాయ కార్యదర్శి పరమేశ్వర్ గౌడ్, కోశాధికారి కరుణాకర్ రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ భిక్షపతి, విజయ్, కమిటీ సభ్యులు శివకుమార్, బాపిరెడ్డి, నాగేశ్వర్‌రావు, కాశీనాథ్, శ్రీనివాస్ రెడ్డి, సత్యరాం, వినోద్ రెడ్డి, వెంకటేష్, ఎల్లా గౌడ్, కాలనీవాసులు, స్థానిక బీఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# 1/70 చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలి

వాజేడు,అక్టోబర్ 12(విజన్ ఆంధ్ర):ఏజెన్సీలో 1/70 చట్టాన్ని అధికారులు పటిష్టంగా అమలు చేయాలని ఏఎన్ఎస్ ములుగు జిల్లా అధ్యక్షులు ఎట్టి విద్యాసాగర్ అన్నారు. వాజేడు మండల కేంద్రంలో సోమవారం జరిగిన గ్రీవెన్స్ డే లో ఆదివాసి నవనిర్మాణ సేన ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా విద్యాసాగర్ మాట్లాడుతూ.. ఏజెన్సీ ఎస్టీసీ కోర్టు నుండి వచ్చిన ఎల్టిఆర్ కేసులు వెంటనే పరిష్కరించి, ఆదివాసీలకు న్యాయం చేయాలన్నారు. పీసా గ్రామసభ లేకుండా ఎటువంటి కాంట్రాక్టు పనులు




ప్రారంభించకూడదన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎస్ సోషల్ మీడియా ప్రతినిధి పాయం అజయ్ కుమార్, తల్లడి ప్రసాద్, మహేష్, సంతోష్, నారాయణ తదితరులు పాల్గొన్నారు



# చేగుంట విద్యుత్ సమస్యపై చెరుకు శ్రీనివాస్ రెడ్డి తక్షణ స్పందన

చేగుంట అక్టోబర్ 12విజన్ ఆంధ్ర : జిల్లా ఎస్ఈకి ఫోన్ చేసి 11 గంటల విద్యుత్ సరఫరాకు ఆదేశం

చేగుంట మండలంలో నెలకొన్న విద్యుత్ సమస్యను మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వడ్ల నవీన్ కుమార్ లిదుబ్బాక నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్ రెడ్డిలి దృష్టికి తీసుకెళ్లారు.

దీనిపై వెంటనే స్పందించిన లిచెరుకు శ్రీనివాస్ రెడ్డిలి జిల్లా విద్యుత్ శాఖ ఎస్ఈకి ఫోన్ చేసి,చేగుంట మండల ప్రజలకు రోజుకు 11 గంటల పాటు విద్యుత్ సరఫరా చేయాలని ఆదేశించారు.

వారితోపాటు చేగుంట మండలం మార్కెట్ కమిటీ చైర్మన్ తాడెం వెంగళరావు గారు ఉన్నారు..

# ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయం..

- కాలనీ అభివృద్ధికి కొత్త కిషోర్ గౌడ్ భరోసా!
- శ్రీ మహాలక్ష్మీనగర్‌లో మార్నింగ్ వాక్.. ప్రజలతో మమేకమై సమస్యలపై ఆరా
- పెండింగ్ పనులు త్వరలో ప్రారంభిస్తామని వెల్లడి



బోడుప్పల్,అక్టోబర్ 12(విజన్ ఆంధ్ర ప్రతినిధి) : ప్రజా సమస్యలను క్షేత్రస్థాయిలో తెలుసుకొని, వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవడమే లక్ష్యంగా మేడ్చల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ బి-బ్లాక్ ప్రధాన కార్యదర్శి కొత్త కిషోర్ గౌడ్ శ్రీ మహాలక్ష్మీనగర్ కాలనీలో మార్నింగ్ వాక్ నిర్వహించారు. ఈ సందర్భంగా కాలనీలో పర్యటిస్తూ స్థానికులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కాలనీలో మెరుగైన మౌలిక వసతుల కల్పనకు నిరంతరం కృషి చేస్తానని హామీ ఇచ్చారు.కాలనీవాసులకు నాణ్యమైన విద్యుత్ సరఫరా అందించేందుకు నూతన ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేసినట్లు కిషోర్ గౌడ్ తెలిపారు. పెండింగ్‌లో ఉన్న సీసీ రోడ్లు, డ్రైనేజీ అభివృద్ధి పనులను త్వరలోనే ప్రారంభించేలా కృషి చేస్తామని వెల్లడించారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని పేర్కొన్నారు. ఈ సందర్భంగా కాలనీ అధ్యక్షుడు రూపని విష్ణు మాట్లాడుతూ.. కాలనీ అభివృద్ధికి, ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తున్న కొత్త కిషోర్ గౌడ్‌కు కాలనీవాసుల తరఫున ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ బి-బ్లాక్ మైనార్టీ అధ్యక్షుడు షేక్ అక్బర్, కాలనీ అధ్యక్షుడు రూపని విష్ణు, ఉపాధ్యక్షుడు జయశంకర్, వర్కింగ్ ప్రెసిడెంట్ దయాకర్ రెడ్డి, కోశాధికారులు సుదర్శన్ రావు, సంపత్,అసోసియేషన్ సభ్యులు, కాలనీవాసులు పాల్గొన్నారు.

# ముగిసిన 'పరివర్తన్' నాయకత్వ శిక్షణ కార్యక్రమం

జన్నారం, అక్టోబర్ 12 (విజన్ ఆంధ్ర) : విద్యాసంస్థ లు కేవలం వ్యవస్థాపకులు ఉన్నత కాలమే కాకుం డా వారు లేకున్నా తమ ఆశయాలు, విలువలు స మర్థవంతంగా కొనసాగాలనే లక్ష్యంతో జన్నారం మండలకేంద్రంలోని స్లేట్ ఎక్సలెన్స్ పాఠశాలలో స్లేట్ గ్రూప్ ఆఫ్ స్కూల్స్ చైర్మన్ స్కూల్స్ ఎంపవర్ మెంట్ అండ్ అడ్వాన్స్ మెంట్ నెట్ వర్క్ వ్యవస్థా పకులు డాక్టర్ ఏనుగు శ్రీకాంత్ రెడ్డి ఆధ్వర్యంలో రోజుల పాటు జరిగిన పరివర్తన్ నాయకత్వ శిక్షణ కార్యక్రమం సోమవారం రోజుతో ముగిసింది. ఈ సందర్భంగా శ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతూ సుమారు వంద మంది విద్యాసంస్థల అధినేతలకు ఇచ్చిన ఈ శిక్షణ ద్వారా వంద పాఠశాలలను విజనరీ ఇన్‌స్టిట్యూషన్స్‌గా తీర్చిదిద్దే అవకాశం లభించిందని ఆయన అన్నారు. వికసిత భారత్ నిర్మాణంలో విద్యాసంస్థల పాత్ర అత్యంత కీలకమని ఒక గొప్ప విద్యాసంస్థ అంటే దాని వ్యవస్థాపకుడు ఉన్నప్పు డే గొప్పగా నడిచేది కాదని ఆయన లేకున్నా అదే ఆశయంతో, విలువలతో, నాణ్యతతో తరతరాల పాటు సమాజానికి సేవలందించగలిగేదే నిజమైన విజనరీ ఇన్‌స్టిట్యూషన్ అని అలాంటి సంస్థలను నిర్మించడమే నాయకత్వానికి అసలైన సార్థకత అని పేర్కొన్నారు. చాలామంది విద్యాసంస్థల అధి నేతలు ప్రతిరోజూ ఎదురయ్యే సమస్యలను పరి ష్కరించడంలోనే తమ సమయాన్ని వెచ్చిస్తున్నా రని, సమస్యలన్నింటినీ నాయకుడే పరిష్కరించే పరిస్థితి నుంచి, నాయకుడి ప్రమేయం లేకుండానే సమర్థవంతంగా పనిచేసే వ్యవస్థలను నిర్మించే స్థా యికి ఎదగాలని సూచించారు. ఈ శిక్షణలో టైమ్ టెల్లర్ వర్సెస్ క్లాక్ బిల్డర్, జీనియస్ ఆఫ్ అండ్, కోర్ ఐడియాలజీ, కోర్ పర్పస్, ప్రిజర్వ్ ది కోర్ అం డ్ స్టిమ్యులేట్ ప్రోగ్రెస్, బీహాగ్ , విజన్ ఫ్రేమ్‌వర్క్ తదితర నాయకత్వ భావనలను ఆచరణాత్మక ఉదాహరణలతో వివరిస్తూ విద్యాసంస్థల్లో క్రమశి క్షణతో పాటు గౌరవం, ప్రేమతో పాటు జవాబుదా రీతనం, విలువలతో పాటు అత్యుత్తమ ఫలితాలు సాధించే సంస్కృతిని ఎలా నిర్మించాలో చర్చించా రు. ఈ ఏడాది జనవరి, ఫిబ్రవరి నెలల్లో నిర్వహిం చిన శిక్షణ కార్యక్రమాల ద్వారా 80 మంది, తాజా గా అక్టోబర్‌లో నిర్వహించిన కార్యక్రమం ద్వారా మరో 20 మంది ప్రయోజనం పొందడంతో మొత్తం 100 మంది విద్యాసంస్థల నాయకులకు శిక్షణ అందించిన మైలురాయిని చేరుకున్నట్లు తెలిపా రు. ఒక్కో విద్యాసంస్థ వేలాది మంది విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దగలదని అటువంటి సంస్థ లు తరతరాల పాటు కొనసాగితే సమాజంపై వాటి ప్రభావం అపారంగా ఉంటుందని ఇదే వికసిత భా రత్ నిర్మాణానికి మనం అందించగలిగే విలువైన సహకారం అని ఆయన అభిప్రాయపడ్డారు

# కుత్బుల్లాపూర్ చౌరస్తాకు ట్రాఫిక్ కష్టాల నుంచి విముక్తి కల్పించండి!

- చౌరస్తా అభివృద్ధికి రహదారుల విస్తరణ చేపట్టాలి
- శివారు ప్రాంతాల్లో పారిశుద్ధ్యం, మురుగునీటి నిర్వహణ మెరుగుపర్చాలి
- పెండింగ్ పనులను వేగవంతం చేసి మౌలిక వసతులు కల్పించాలి
- జోనల్ కమిషనర్ పింకేష్ కుమార్‌తో ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ సమావేశం

కుత్బుల్లాపూర్, అక్టోబర్ 12 (విజన్ ఆంధ్ర): కుత్బుల్లాపూర్ చౌరస్తాలో ట్రాఫిక్ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపడంతో పాటు నియోజకవర్గంలోని శివారు ప్రాంతాల్లో మౌలిక వసతులను మెరుగుపర్చాలని బీఆర్ఎస్ శాసనసభాపక్ష విప్, ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ అధికారులను కోరారు. ఈ మేరకు సోమవారం కుత్బుల్లాపూర్ జోనల్ కమిషనర్ పింకేష్ కుమార్‌తో ఆయన కార్యాలయంలో ప్రత్యేకంగా సమావేశమైన ఎమ్మెల్యే..



నియోజకవర్గంలో ప్రజలు ఎదుర్కొంటున్న పలు సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లారు.

చౌరస్తా అభివృద్ధికి ప్రాధాన్యం

కుత్బుల్లాపూర్ మున్సిపల్ చౌరస్తాలో నిత్యం తలెత్తుతున్న ట్రాఫిక్ ఇబ్బందులను తొలగించేందుకు సమగ్ర ప్రణాళిక రూపొందించాలని ఎమ్మెల్యే సూచించారు. చౌరస్తాను ట్రాఫిక్ రద్దీ లేని కూడలిగా తీర్చిదిద్దే లక్ష్యంతో రహదారుల విస్తరణ పనులను చేపట్టాలని కోరారు. పెరుగుతున్న వాహనాల రాకపోకలకు అనుగుణంగా అవసరమైన చర్యలు తీసుకొని ప్రయాణికులకు ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు.

శివారు ప్రాంతాల్లో పారిశుద్ధ్యంపై దృష్టి

కొత్తగా ఏర్పాటైన సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (సీఎంసీ)లో విలీనమైన శివారు మున్సిపాలిటీల్లో పారిశుద్ధ్య నిర్వహణ, భూగర్భ మురుగునీటి వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉన్నాయని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఆయా ప్రాంతాల్లో సమస్యలను గుర్తించి ప్రణాళికాబద్ధంగా పరిష్కరించాలని అధికారులకు సూచించారు. ముఖ్యంగా కొంపల్లి, నిజాంపేట్, దుండిగల్ సర్కిళ్ల పరిధిలోని అన్ని ప్రాంతాలకు అవసరమైన మౌలిక వసతులు కల్పించి, ప్రజలకు మెరుగైన పౌర సేవలు అందేలా చర్యలు తీసుకోవాలన్నారు.

పెండింగ్ పనులు త్వరగా పూర్తి చేయాలి

నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల్లో సీసీ రహదారుల నిర్మాణంతో పాటు రోడ్ల విస్తరణ, పారిశుద్ధ్యం, మురుగునీటి నిర్వహణకు సంబంధించిన పనులపై ప్రత్యేక దృష్టి సారించాలని ఎమ్మెల్యే కోరారు. ఇప్పటికే ప్రారంభమైన, పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులను వేగవంతం చేసి నిర్ణీత సమయంలో పూర్తి చేయాలని సూచించారు. ప్రజలు నిత్యం ఎదుర్కొంటున్న సమస్యలకు ప్రాధాన్యమిస్తూ మౌలిక వసతుల కల్పనకు సమగ్ర కార్యాచరణ రూపొందించాలని అధికారులకు స్పష్టం చేశారు. ఈ సమావేశంలో జీడిమెట్ల సర్కిల్ ఉప కమిషనర్ శంకర్ సింగ్‌తో పాటు వివిధ విభాగాలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.



# పందిళ్ళ గ్రామంలో సద్దుల బతుకమ్మ ముందస్తు ఏర్పాట్లు

## పందిల్ల గ్రామ సర్పంచ్ తోడేటి రమేష్

హుస్నాబాద్ విజన్ ఆంధ్ర అక్టోబర్ 12 : సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ మండలంలోని పందిల్ల గ్రామంలో సద్దుల బతుకమ్మ సందర్భంగా గ్రామ సర్పంచ్ తోడేటి రమేష్ ఆధ్వర్యంలో ముందస్తు ఏర్పాట్లు శరవేగంగా సాగుతున్నాయి.ఈ సందర్భంగా పందిల్ల గ్రామంలో తొమ్మిది రోజులు చిన్న బతుకమ్మ ఆడిన మహిళలు సద్దుల బతుకమ్మ పండుగ రోజున ప్రజలకు ముఖ్యంగా మహిళలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా బతుకమ్మ ఆడే స్థలం వద్ద మరియు వివిధ వార్డులలో రోడ్లపై గుంతలు ఉన్నచోట మొరంతొ నింపి చదును చేస్తున్నారు.పరిసరాలను పరిశుభ్రత ప్రత్యేక పారిశుధ్య చర్యలు చేపడుతున్నారు.రాత్రి సమయంలో ఇబ్బంది పడకుండా గ్రామంలో విద్యుత్ ఫ్లడ్ నైట్ ఏర్పాట్లు, త్రాగునీటి సౌకర్యం ఏర్పాటు చేస్తున్నారు. బతుకమ్మ నిమజ్జనం కోసం చెరువు వద్ద బతుకమ్మ ఘాట్ సిద్ధం చేశారు. ఏలాంటి ప్రమాదాలు జరగకుండా రక్షణ చర్యలు తీసుకుంటున్నారు.సకల సదుపాయాలు ఏర్పాటు చేస్తున్నామని సర్పంచ్ఈ రమేష్ తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ పాలకవర్గం మరియు పంచాయతీ సెక్రెటరీ సిబ్బంది పాల్గొన్నారు.

# ఎల్ఈఓ ప్రభావంతో ఉన్న నీటివనరులను పొదుపుగా వినియోగించుకోవాలి

## - సిద్దిపేట జిల్లా కలెక్టర్ కె. హైమావతి

హుస్నాబాద్ విజన్ ఆంధ్ర అక్టోబర్ 12 : ఎల్ నినో ప్రభావం వర్షాలు తక్కువగా కురిసినందున, ఉన్న నీటి వనరులను పొదుపుగా వినియోగించుకోవాలని సిద్దిపేట జిల్లా జిల్లా కలెక్టర్ కే.హైమావతి అన్నారు. సోమవారం రోజున ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొన్నం ప్రభాకర్, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు హైదరాబాద్ నుంచి పలువురు ఉన్నతాధికారులతో కలిసి రైతు నేస్తం కార్యక్రమంలో భాగంగా వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల్లోని రైతు వేదికల్లో పాల్గొన్న సంబంధిత శాఖల అధికారులు, రైతులతో మాట్లాడారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రబీ సీజన్లో ఎట్టి పరిస్థితుల్లో రైతులు వరి సాగు చేయవద్దన్నారు. బిందు సేద్యంతో పామ్ తోటలు, కూరగాయలు వంటి స్వల్పకాలిక పంటలను సాగు చేయవచ్చన్నారు. జలసిరి కార్యక్రమంలో భాగంగా ఇంకుడు గుంతలు, నీటి కుంటలు, బోర్వెల్స్ రీఛార్జ్, తదితర పనులను చేపట్టి జలవనరులను కాపాడుకోవాలన్నారు. రాష్ట్రంలో 315 మండలాల్లో వర్షపాతం తక్కువగా ఉందని, ప్రభుత్వం త్వరలోనే కరువు మండలాలను ప్రకటిస్తుందన్నారు. వచ్చే వర్షాకాలం నాటికి తాగునీటి సమస్యలు ఉత్పన్నమవ్వకుండా నీటిని పొదుపుగా వాడాలని సూచించారు. వ్యవసాయానికి విద్యుత్ సరఫరాపై సరైన ప్రణాళికతో ముందుకెళ్లాలన్నారు. భూగర్భ జల శాఖ అధికారులు ఎప్పటికప్పుడు గ్రౌండ్ లెవెల్ నివేదికలను అందజేయాలన్నారు. ప్రభుత్వం ప్రజా సంక్షేమానికి అవసరమైన చర్యలు చేపడుతుందన్నారు. హుస్నాబాద్ పట్టణంలోని రైతు వేదిక నుండి జిల్లా కలెక్టర్ కే.హైమావతి వ్యవసాయ మరియు వ్యవసాయ అనుబంధ శాఖల అధికారులు, రైతులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ను తిలకించారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా కలెక్టర్ రైతులతో మాట్లాడుతూ ప్రభుత్వ సూచనలను అనుసరించి రైతులు ఆరుతడి పంటలను సాగు చేయాలని తెలిపారు. ఎల్ నినో వంటి పరిస్థితులను ఎదుర్కొనేందుకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించి అమలు చేయడం జరుగుతుందన్నారు. ఆరుతడి పంటల సాగుపై రైతులకు పెద్ద ఎత్తున అవగాహన కలిగేందుకు విస్తృతంగా అన్ని మాధ్యమాల ద్వారా



ప్రచార కార్యక్రమాలు కూడా నిర్వహిస్తామన్నారు. రైతులు నష్ట పోకుండా ముందస్తుగా అప్రమత్తం చేసేందుకు ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా అధికార యంత్రాంగం కృషి చేస్తారని ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డీఏఓ స్వరూప రాణి, డిఎచ్ఓ సువర్ణ, మున్సిపల్ చైర్ పర్సన్ దండి లక్ష్మి, వైస్ చైర్మన్ చిత్తారి పద్మ, కౌన్సిలర్లు, మార్కెట్ కమిటీ చైర్మన్ తిరుపతిరెడ్డి, వ్యవసాయ అధికారులు వేల్పుల పూజ జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి, జిల్లా మార్కెటింగ్ అధికారి, జిల్లా పట్టు పరిశ్రమలశాఖ అధికారి, ఆయా శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

### ఎల్లమ్మ చెరువు కట్టపై బతుకమ్మ ఏర్పాట్లను పరిశీలించిన జిల్లా కలెక్టర్

సోమవారం బతుకమ్మ పండుగను పురస్కరించుకొని హుస్నాబాద్ పట్టణంలో ఎల్లమ్మ చెరువు కట్టపై చేపడుతున్న బతుకమ్మ పండుగ ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ కె. హైమావతి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ బతుకమ్మ పండుగకు వచ్చే మహిళలు, ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. చెరువు కట్ట పరిసరాల్లో పారిశుధ్య నిర్వహణ, తాగునీటి సరఫరా, విద్యుత్ దీపాల ఏర్పాటు, బతుకమ్మ నిమజ్జనానికి అవసరమైన సదుపాయాలు కల్పించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ దండి లక్ష్మి,వైస్ చైర్మన్ చిత్తారి పద్మ, కౌన్సిలర్లు,తాహసిల్దార్ లక్ష్మారెడ్డి,సర్పంచ్ వేల్పుల సంపత్ ఆయా శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# బతుకమ్మ సంబరాల్లో రేలా గాయకుడికి చిరు సన్మానం

## మున్సిపల్ చేర్మెన్ బుర్ర కొమురయ్య గారి చేతుల మీదుగా అవార్డు తీసుకున్న రాజ్ సడవల్

మహాదేవపూర్ అక్టోబర్ 12 (విజన్ ఆంధ్ర) : జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రం లో ఆదివారం రోజున భూపాలపల్లి జిల్లా మున్సిపల్ చేర్మెన్ బుర్ర కొమురయ్య గారి సౌజన్యం తొ, జిల్లా సాంస్కృతిక సంఘాల ఆధ్వర్యంలో, జిల్లా స్థాయి బతుకమ్మ సంబరాలు నిర్వహించారు, ఈ కార్యక్రమానికి, టీపీసీసీ సాంస్కృతిక సేన జిల్లా కళాకారులని, ఆహ్వానించారు, చంద్రుపల్లి గ్రామానికి చెందిన రేలా రాజ్ సడవల్ బతుకమ్మ పాటలు పల్లె జానపదాలు, కోలాటం పాటలతో, స్టేజిని ఊర్రుత లుగించాడు, ఆయనా 18 సంవత్సరాల కలని గుర్తించి మున్సిపల్ చేర్మెన్ బుర్ర కొమురయ్య ఘనంగా సన్మానించి , ప్రశంసా పత్రం మరియి, శీల్డ్ అందజేశారు, ఈ కార్యక్రమం లో జిల్లాలో అన్ని మండలాల నుండి కోలాటం కళాకారులూ, సాంస్కృతిక సారధి కళాకారులూ, టీపీసీసీ సాంస్కృతిక సేన కళాకారులూ, పాల్గొని స్టేజిని ఊర్రుత లుగించారు



# చైనా మాంజతో ప్రాణాలకు ముప్పు.. ఇద్దరు యువకులకు రవీందర్ హెచ్చరిక!

**- సూరారం చౌరస్తాలో గాలిపటాలు ఎగురవేస్తున్న యువకులకు హితవు**

**- జీడిమెట్లలో ఇటీవలే తీవ్ర గాయాలతో ఆసుపత్రి పాలైన వ్యక్తి**

**- అక్రమ విక్రయాలపై పోలీసులకు సమాచారం ఇవ్వాలని ప్రజలకు పిలుపు**

కుత్బుల్లాపూర్, అక్టోబర్ 12 (విజన్ ఆంధ్ర): ప్రజల ప్రాణాలకు ముప్పుగా మారిన చైనా మాంజ వినియోగాన్ని అరికట్టేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని సామాజిక, పర్యావరణ ప్రేమికుడు కోల రవీందర్ ముదిరాజు కోరారు. సూరారం చౌరస్తాలో చైనా మాంజతో గాలిపటాలు ఎగురవేస్తున్న ఇద్దరు యువకులను ఆయన పట్టుకుని, దాని వల్ల కలిగే ప్రమాదాలను వివరించారు. ఇలాంటి చర్యలకు పాల్పడవద్దని హెచ్చరిస్తూ, ప్రజల భద్రతను దృష్టిలో ఉంచుకోవాలని సూచించారు.



ప్రాణాంతకంగా మారుతున్న మాంజ

చైనా మాంజ మెడకు చుట్టుకోవడంతో ద్విచక్ర వాహనదారులు, పాదచారులు తీవ్రంగా గాయపడుతున్న ఘటనలు గతంలో చోటుచేసుకున్నాయి. ఓ సైనిక ఉద్యోగి, ఓ కానిస్టేబుల్ సహా పలువురు ప్రమాదాల బారినపడిన ఉదంతాలు ఆందోళన కలిగిస్తున్నాయని రవీందర్ ముదిరాజు పేర్కొన్నారు. తాజాగా జీడిమెట్లలో మనీష్ అనే వ్యక్తి తీవ్ర గాయాలతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నట్లు తెలిపారు. సరదా కోసం చేసే గాలిపటాల వినోదం ఇతరుల ప్రాణాలకు ముప్పుగా మారకూడదని హితవు పలికారు.

విక్రయదారుల వివరాలు వెల్లడించండి

చైనా మాంజ విక్రయిస్తున్న వారి వివరాలు, చిరునామా తెలిసినవారు స్థానిక పోలీసులకు సమాచారం అందించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ప్రజలు అప్రమత్తంగా ఉంటే ప్రమాదాలను నివారించడంతోపాటు అమాయకుల ప్రాణాలను కాపాడవచ్చని అన్నారు. ఈ విషయంలో ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతతో వ్యవహరించాలని కోరారు.

నియంత్రణకు ప్రజాప్రతినిధుల చొరవ అవసరం

చైనా మాంజ విక్రయాలు, వినియోగాన్ని అరికట్టేందుకు స్థానిక సర్పంచులు, వార్డు సభ్యులు, కౌన్సిలర్లు, మహిళా సంఘాలు, కాలనీ అధ్యక్షులు, కార్యదర్శులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని రవీందర్ ముదిరాజు పిలుపునిచ్చారు. నిబంధనలను ఉల్లంఘించే విక్రయదారులపై చట్టప్రకారం చర్యలు తీసుకునేలా పోలీసులకు సహకరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీసీఎం రాజు, అనిల్, అశోక్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.